


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 07-06-2026 | సంపుటి - 28 | సంచిక -12 | రూ : 4 | పేజీలు: 8




# ధాన్యం కొనలేని మోదీ గద్దె దిగాలి

- పనితీరు ఆధారంగానే పార్టీలో గుర్తింపు ఉంటుందని చంద్రబాబు స్పష్టీకరణ
- తప్పులు చేసేవారిని వదిలించుకుంటానని హెచ్చరిక
- డీఎస్సీపై 'గొడ్డలి పార్టీ' దుష్ప్రచారాన్ని ఆధారాలతో తిప్పికొట్టామన్న ముఖ్యమంత్రి
- లోకేష్ పట్టుదలతో పనిచేసి మంగళగిరిని టీడీపీకి కంచుకోటగా మార్చారని ప్రశంస
- ఎన్నికల హామీలను నెరవేరుస్తున్నామని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని శ్రేణులకు సూచన

2లో

## మహిళా ప్రయాణికులకు 'స్త్రీ రైడ్'

- రాజధానిలో అందుబాటులోకి 55 మంది డ్రైవర్లు
- మహిళా సాధికారతలో కీలక అడుగు: డీజీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్: మహిళా ప్రయాణికులు ఇకపై మహిళలు నడిపే కార్లు, ఆటోలు, బైక్‌లపైనే ప్రయాణించొచ్చు. ఇందుకోసం హైదరాబాద్‌లో 55 మంది మహిళా డ్రైవర్లు అందుబాటులోకి వచ్చారు. ఓలా, ఉబర్, రాపిడోలాంటి అగ్రిగేటర్ల యాప్‌లో తరువాయి 2లో






## 'దేవాన్ష్ ఘాట్'పై మంత్రి లోకేశ్ సీరియస్..

- గోదావరి పుష్కర ఘాట్‌కు దేవాన్ష్ పేరు పెట్టడంపై వివాదం
- సోషల్ మీడియాలో విమర్శలు రావడంతో స్పందించిన మంత్రి లోకేశ్
- ఇది చాలా హాస్యాస్పదం అని, వెంటనే పేరు తొలగించాలని ఆదేశం
- విషయాన్ని తన దృష్టికి తెచ్చిన నెటిజన్లకు లోకేశ్ ధన్యవాదాలు

2లో


## బియ్యం ఎగుమతి చేసే.. మిల్లులకు ప్రోత్సాహకాలు

- కార్మికుల కొరతకు పరిష్కారంగా యాంత్రీకరణ పెంచాలి
- గోదాముల నిర్వహణలో ఏఐ వాడాలి: మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్: రాష్ట్రం నుంచి విదేశాలకు బియ్యం ఎగుమతులు పెంచేందుకు రైస్‌మిల్లులకు ప్రోత్సాహకాల్ని అందించే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోందని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తరువాయి 2లో



## ఏలియన్ సిగ్నల్స్ శాస్త్రవేత్తల కొత్త ప్రణాళిక!




- గ్రహాంతరవాసుల ఉనికి ప్రకటనపై కొత్త మార్గదర్శకాలు
- సోషల్ మీడియా, ఫేక్ న్యూస్ వ్యాప్తిని అడ్డుకోవడమే ప్రధాన లక్ష్యం
- సిగ్నల్ నిర్ధారణకు కఠినమైన శాస్త్రీయ పరిశీలన తప్పనిసరి
- పుకార్లను నమ్మొద్దు, వాస్తవాలకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచన
- దశాబ్దాలుగా సాగుతున్న అన్వేషణలో ఇప్పటికీ ఫలితం శూన్యం

2లో

## చెరువులను వదలని ధనికులు రేవంత్ రెడ్డి ఫైర్

- ప్రభుత్వ ఆస్తులు, జల వనరుల పరిరక్షణకే హైడ్రా ఏర్పాటు అని వెల్లడి
- యువతలో డ్రగ్స్ మహమ్మారిని అరికట్టేందుకు ఈగిల్ ఫోర్స్
- రాష్ట్రంలో మరో 5,000 పోలీసు ఉద్యోగాలకు త్వరలో నోటిఫికేషన్
- హైడ్రా ద్వారా రూ.1 లక్ష కోట్లకు పైగా ఆస్తులను కాపాడినట్లు వెల్లడి

2లో





## ఐరాసలో పాక్‌కు భారత్ గట్టి కౌంటర్.. కశ్మీర్‌పై మరోసారి స్పష్టత


- ఐరాసలో జమ్ముకశ్మీర్ అంశాన్ని లేవనెత్తిన పాకిస్థాన్‌కు భారత్ కౌంటర్
- కశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని, విడదీయరానిదని స్పష్టీకరణ
- గిల్గిట్-బల్టిస్థాన్‌లో పాక్ ఎన్నికల నిర్వహణపై తీవ్ర నిరసన
- ఆక్రమించిన ప్రాంతాలను వెంటనే ఖాళీ చేయాలని డిమాండ్

2లో

## విమాన ప్రయాణాల్లో కొత్త ఒరవడి నిశ్శబ్దంగా ధ్వని వేగంతో!


- నాసా సరికొత్త చరిత్ర
- ఎక్స్-59 విమాన ప్రయోగం సక్సెస్
- మాక్ 1.1 ధ్వని వేగంతో దూసుకెళ్లిన విమానం
- 'సోనిక్ బూమ్' శబ్దం లేకుండా ప్రయోగం
- ప్రత్యేక డిజైన్‌తో శబ్ద తరంగాల నియంత్రణ

2లో



# ధాన్యం కొనలేని మోదీ గద్దె దిగాలి

హైదరాబాద్: తెలంగాణలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనలేని ప్రధానమంత్రి నరేంద్రమోదీ గద్దె దిగాలని, రాహుల్ గాంధీని ప్రధానిగా చేస్తే ప్రతి గింజ కేంద్రంతో కొనుగోలు చేయిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. ఎవరెంత మొత్తుకున్నా.. తాము చేపట్టిన అభివృద్ధి పనులు ఆపేది లేదన్నారు. ఆ క్రమంలో ఫామ్‌హౌస్‌లో పడుకున్న వారితోనైనా, ఢిల్లీలో ఉన్న మోదీతోనైనా కొట్లాడతానన్నారు. ఈ నెల 15 తర్వాత ధాన్యం కొనకపోతే కేంద్రం సంగతి చూస్తానని మరోసారి హెచ్చరించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని కోహెడలో అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్, సమీకృత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణాలకు సీఎం శనివారం రాత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్‌బాబు తదితరులతో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులను ఉద్దేశించి ప్రసంగించారు. రైతులు వరితో పాటు కూరగాయలు, పండ్లు పండిస్తే వారికి అద్భుతమైన మార్కెట్ ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. "రంగారెడ్డి జిల్లా రైతులు కష్టపడి హైదరాబాద్ ప్రజలకు పండ్లు, కూరగాయలు, పాలు అందించేవారు. రియల్ ఎస్టేట్ పెరిగి వ్యవసాయం కుంటుపడింది. హైదరాబాద్ లోపల 1.30 కోట్ల జనాభా నివసిస్తోంది. అంతర్జాతీయ నగరంగా పెరిగిపోవడంతో ప్రజల అవసరాలను తీర్చలేకపోతున్నాం. గతంలో తాత్కాలికంగా రేకుల షెడ్లు వేసి మార్కెట్ నిర్మిస్తే గాలివానకు కూలి అనేక మంది రైతులు గాయపడ్డారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పండ్ల మార్కెట్ నిర్మిస్తామని ఆనాడే హామీ ఇచ్చాను. పాలు, పండ్లు, కూరగాయలు.. ఇలా అన్నీ ఇక్కడ అందుబాటులో ఉండేలా 240 ఎకరాల్లో మార్కెట్‌ను నిర్మించనున్నాం. అంతర్జాతీయ విమానాశ్రయం తర్వాత కోహెడ ఫ్రూట్ మార్కెట్ తెలంగాణకు మరింత గుర్తింపు



తెస్తుందని ఆశిస్తున్నాం. మనం కొత్తిమీర లాంటివి కూడా పక్క రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. కూరగాయలు, పండ్ల సాగును ప్రోత్సహించేందుకే మార్కెట్ సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నాం. మన ప్రాంతంలో ప్రతి పండును పండించాలి. కందుకూరు ప్రాంతంలో పండించే టమాటా కోసం సాస్ ఫ్యాక్టరీని తీసుకువస్తాం.

**కారు తోయడానికి ఎవరూ ఉండరు**

ఫ్రూట్ మార్కెట్‌ను అడ్డుకోవడానికి కొందరు ప్రయత్నిస్తున్నారు. భారాస నాయకులు అధికారంలోకి వస్తే.. భారత్ ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటున్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, వరంగల్, ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టులు, పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, తుమ్మిడిహెట్టి వంటి ప్రాజెక్టులకూ అడ్డు తగులుతున్నారు. ఇదే ధోరణిలో వ్యవహరిస్తే.. రాబోయే రోజుల్లో భారాసకు ప్రతిపక్ష హోదా కాదు కదా.. కారును తోయడానికి కూడా ఎవరూ దొరకరు.

**రెండేళ్లలో నిర్మాణం**

కోహెడలో నిర్మించే కొత్త పండ్ల మార్కెట్‌లో మొదటిదశ నిర్మాణాలను వచ్చే డిసెంబరుకే పూర్తి చేసి.. వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించాలి. మొత్తం నిర్మాణాలను రెండేళ్లలో పూర్తి చేయాలి. దీనికి నిధుల కొరత లేదు. అవసరమైనన్ని నిధులను గ్రీన్ ఛానల్‌లో ఇస్తాం. కేసీఆర్ కుర్చీ వేసుకుని పాలమూరు రంగారెడ్డి కడతానని అన్నారు.. కానీ ఇప్పుడు ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారు. పండ్ల మార్కెట్ నిర్మాణం కోసం మంత్రులు తుమ్మల, శ్రీధర్‌బాబు ఇక్కడ కుర్చీ వేసుకుని కూర్చోవాలి.

## బియ్యం ఎగుమతి చేసే మిల్లులకు ప్రోత్సాహకాలు

హైదరాబాద్: రాష్ట్రం నుంచి విదేశాలకు బియ్యం ఎగుమతులు పెంచేందుకు రైస్‌మిల్లులకు ప్రోత్సాహకాల్ని అందించే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తోందని నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. పీపీపీ విధానంలో భారీ సామర్థ్యంతో గోదాముల నిర్మాణానికి పెట్టుబడిదారులు ముందుకు రావాలని ఆయన ఆహ్వానించారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన సదస్సులో మాట్లాడారు. ప్రపంచ బియ్యం మార్కెట్లో తెలంగాణకు ప్రత్యేక స్థానం తీసుకురావడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైస్‌మిల్లుల్లో ఆధునిక టెక్నాలజీ వాడకాన్ని పెంచాలని..కార్మికుల సమస్య ప్రధాన సవాలుగా మారిన నేపథ్యంలో దీన్ని అధిగమించేందుకు యాంత్రీకరణ, ఆటోమేషన్ వంటి విధానాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన మిల్లర్లకు సూచించారు. గోదాముల నిర్వహణలో ఏఐని వినియోగించాలన్నారు. 'పార్బాయిలింగ్ యూనిట్లలో నీటి వినియోగాన్ని తగ్గించే, విద్యుత్తు ఆదా చేసే ఆధునిక సాంకేతికతలను పరిశ్రమలు ఉపయోగించాలి. భవిష్యత్ ప్రాసెసింగ్ యూనిట్లలో నీటి పునర్వినియోగం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమివ్వాలి. నాణ్యతతో పాటు పోషక విలువలను కూడా దృష్టిలో ఉంచుకుని బియ్యం ప్రాసెసింగ్ జరగాలి.

## మహిళా ప్రయాణికులకు 'స్త్రీ రైడ్'

హైదరాబాద్: మహిళా ప్రయాణికులు ఇకపై మహిళలు నడిపే కార్లు, ఆటోలు, బైక్‌లపైనే ప్రయాణించొచ్చు. ఇందుకోసం హైదరాబాద్‌లో 55 మంది మహిళా డ్రైవర్లు అందుబాటులోకి వచ్చారు. ఓలా, ఉబర్, రాపిడోలాంటి అగ్రిగేటర్ల యాప్‌లో మహిళా ప్రయాణికులెవరైనా రైడ్‌ను బుక్ చేసినప్పుడు... అక్కడికి సమీపంలో మహిళా డ్రైవర్లుంటే వీరినే పంపించేలా కార్యాచరణ రూపొందించారు. వీరి సేవలు శనివారం అందుబాటులోకి వచ్చాయి. డీజీపీ సీవీ ఆనంద్ తన కార్యాలయం ఆవరణలో ఈ వాహనాల్ని ప్రారంభించారు.

*** భద్రత.. సాధికారత.. ఆర్థిక స్వాతంత్ర్యం...**

తెలంగాణ మహిళా భద్రత విభాగం అతివలకు భద్రత, సాధికారత, ఆర్థిక స్వాతంత్ర్యం.. అనే మూడింటిని లక్ష్యంగా చేసుకొని సరికొత్త కార్యాచరణకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే వాహనాలు నడిపేందుకు వీలుగా 'స్త్రీ రైడ్' పేరుతో మహిళా డ్రైవర్లకు అవకాశం కల్పించింది. ఇందుకు మహిళా భద్రత విభాగం వెబ్‌సైట్‌తోపాటు ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులను సేకరించింది. వారి నుంచి 55 మందిని ఎంపిక చేసి స్వచ్ఛంద సంస్థల సహకారంతో డ్రైవింగ్‌లో శిక్షణ ఇవ్వడంతోపాటు ఈవీ వాహనాల కొనుగోలు సదుపాయం కల్పించింది. వారిలో 50 మందిని బైక్‌రైడర్లుగా, నలుగురిని ఆటోడ్రైవర్లుగా, ఒకరిని కార్‌డ్రైవర్‌గా తీర్చిదిద్దింది. మొబిలిటీ సర్వీస్ ప్రొవైడర్లతోపాటు ఓలా, ఉబర్, రాపిడోలాంటి అగ్రిగేటర్లతో అనుసంధానం చేయడం ద్వారా ఉపాధి అవకాశాలనూ కల్పించింది. 'స్త్రీరైడ్ కేవలం రవాణా కార్యక్రమం మాత్రమే కాకుండా తెలంగాణ మహిళలకు ఆత్మవిశ్వాసం, గౌరవం, స్వాతంత్ర్యం, కొత్త అవకాశాలను అందించే ఒక ఉద్యమం..' అని తెలంగాణ మహిళా భద్రత విభాగం డీజీపీ చారుసిన్హా వెల్లడించారు.

*** కష్టాలను ఎదుర్కొన్నప్పుడే విజయం: డీజీపీ**

ఈ సందర్భంగా డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. 'గిగ్‌వర్కర్లలోకి మహిళలు ప్రవేశించడం అభినందనీయం. ఈ ప్రయాణంలో చిన్నచిన్న కష్టాలు సహజం. వాటిని ధైర్యంగా ఎదుర్కొన్నప్పుడే విజయం సాధించగలుగుతారు. మిగ్ 23, మిరేజ్‌లు నడుపుతున్న మహిళల్ని స్ఫూర్తిగా తీసుకోండి. జనాభాలో 50 శాతమున్న మహిళలు బయటికి వచ్చి పనిచేయకపోతే జీఎస్‌డీపీ 50% తగ్గిపోయినట్లేనని గుర్తుంచుకోండి..' అని సూచించారు. కార్యక్రమంలో మహిళా భద్రత విభాగం డీజీ చారుసిన్హా, ప్రభుత్వ కార్యదర్శి అనితారామచంద్రన్, డీజీపీ(ఎల్ అండ్ ఓ) మహేశ్‌భగవత్, ఎస్పీఎఫ్ డీజీ స్వాతిలక్రా, రవాణాశాఖ కమిషనర్ ఇలంబర్తి, మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ డైరెక్టర్ శ్రుతిఓజా తదితరులు పాల్గొన్నారు.

## విమాన ప్రయాణాల్లో కొత్త ఒరవడి నిశ్శబ్దంగా ధ్వని వేగంతో!

అమెరికా అంతరిక్ష సంస్థ 'నాసా' సరికొత్త చరిత్ర సృష్టించింది. 'ఎక్స్59' ప్రయోగాత్మక విమానం తొలిసారి ధ్వని వేగాన్ని అధిగమించింది. నిన్న కాలిఫోర్నియాలో జరిగిన ఈ సూపర్‌సోనిక్ పరీక్ష విజయవంతమైంది. ఈ విమానం గంటకు సుమారు 1,147 కిలోమీటర్ల గరిష్ఠ వేగాన్ని (మాక్ 1.1) అందుకుంది. నాసా చేపట్టిన ప్రతిష్ఠాత్మక 'క్వెస్ట్' మిషన్‌లో ఇదొక చారిత్రక మైలురాయి. సాధారణంగా ఏ విమానమైనా ధ్వని వేగాన్ని దాటినప్పుడు భారీ శబ్దం వస్తుంది. దీన్ని సైన్స్ భాషలో 'సోనిక్ బూమ్' అని పిలుస్తారు. ఈ శబ్దం పిడుగు పడినట్లు చాలా భయంకరంగా ఉంటుంది. దీనివల్ల భూమిపై ఉన్న ఇళ్ల కిటికీ అద్దాలు కూడా పగిలిపోతాయి. ఈ ప్రమాదం కారణంగానే జనాభా ఉండే భూభాగాలపై సూపర్‌సోనిక్ విమానాల ప్రయాణాన్ని నిషేధించారు. ఈ ధ్వని సమస్యను అధిగమించేందుకు నాసా ఇంజనీర్లు ఒక కొత్త ప్రయోగం చేశారు. వారు ఈ విమానాన్ని ఒక ప్రత్యేకమైన పొడవాటి ఆకారంతో డిజైన్ చేశారు. దీని ముక్కు భాగమే దాదాపు 30 అడుగుల పొడవు ఉంటుంది. ఈ వినూత్న డిజైన్ వల్ల గాలి ఒత్తిడి తరంగాలు ఒకదానితో ఒకటి కలవవు. ఫలితంగా విమానం ధ్వని వేగాన్ని దాటినా ఎలాంటి భారీ శబ్దం బయటకు రాదు. ఈ ప్రయోగం వల్ల కేవలం ఒక కారు డోర్ వేసినంత చిన్న శబ్దం మాత్రమే వినిపిస్తుంది. విమానం ఇంజిన్‌ను కూడా బాడీ పైభాగంలో అమర్చి శబ్దాన్ని నియంత్రించారు. రాబోయే రోజుల్లో ఈ విమానాన్ని మరింత వేగంతో పరీక్షించేందుకు నాసా సిద్ధమవుతోంది. ఈ ప్రయోగాలు పూర్తిగా విజయవంతమైతే భవిష్యత్తులో శబ్దం లేని సూపర్‌సోనిక్ ప్రయాణాలు అందరికీ అందుబాటులోకి వస్తాయి.

## ఐరాసలో పాక్‌కు భారత్ గట్టి కౌంటర్.. కశ్మీర్‌పై మరోసారి స్పష్టత

జమ్ముకశ్మీర్ అంశంపై ఐక్యరాజ్యసమితి (ఐరాస) వేదికగా పాకిస్థాన్ చేసిన వ్యాఖ్యలను భారత్ తీవ్రంగా ఖండించింది. జమ్ముకశ్మీర్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని, అది తమ అంతర్గత వ్యవహారమని గట్టిగా స్పష్టం చేసింది. శుక్రవారం ఐరాస సర్వసభ్య సమావేశంలో భద్రతా మండలి వార్షిక నివేదికపై చర్చ సందర్భంగా ఈ పరిణామం చోటుచేసుకుంది. పాకిస్థాన్ ప్రతినిధి అసిమ్ ఇఫ్తికార్ అహ్మద్ కశ్మీర్ అంశాన్ని ప్రస్తావించగా, ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి పి. హరీశ్ తీవ్రంగా స్పందించారు. "జమ్ముకశ్మీర్ కేంద్ర పాలిత ప్రాంతం భారత్‌లో అంతర్భాగం, ఎప్పటికీ విడదీయలేనిది. దీనికి విరుద్ధంగా చేసే వాదనలకు చారిత్రక ఆధారాలు లేవు. పాకిస్థాన్ చేస్తున్న నిరాధార వాదనలు ఈ వాస్తవాన్ని మార్చలేవు" అని ఆయన తేల్చిచెప్పారు. ఐరాస వేదికలను పాకిస్థాన్ తన రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేస్తోందని విమర్శించారు. మరోవైపు, పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని గిల్గిట్‌బల్టిస్థాన్‌లో జూన్ 7న ఎన్నికలు నిర్వహించాలన్న పాకిస్థాన్ నిర్ణయంపై భారత విదేశాంగ శాఖ తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. ఆ ప్రాంతాన్ని పాకిస్థాన్ ఆక్రమించుకుందని స్పష్టం చేసింది. అక్కడ జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలు, ఆర్థిక దోపిడీని కప్పిపుచ్చుకోవడానికే ఈ ఎన్నికల నాటకానికి తెరలేపిందని ఆరోపించింది.

## పర్యావరణ పరిరక్షణ అవార్డు సిబ్బంది కృషితో లభించింది

ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట మున్సిపాలిటీకి రాష్ట్రస్థాయిలో ఉత్తమ పర్యావరణ పరిరక్షణ అవార్డు రావడం వెనుక పారిశుద్య కార్మికులు, సిబ్బంది, అదికారుల కృషి ఉందని మున్సిపల్ చైర్పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు . శనివారం ఆమె మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రతిరోజు ప్రజల వద్ద నుంచి సేకరణ చేసే చెత్తను బాలెంల డంపింగ్ యార్డ్ కి చేరవేసిన తర్వాత అక్కడ వ్యర్థాలను వేరుచేసి అక్కడ నుండి జమున నగర్ కేంద్రానికి తరలించి అక్కడ ప్లాస్టిక్ ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా కవర్ల నుంచి మ్యాట్ లు, బ్రిక్స్, టైల్స్, యోగ మ్యాట్స్ వంటి ఉత్పత్తులను తయారుచేసి ఆ ఉత్పత్తులను అమ్మడం జరుగుతుందని వాటి ద్వారా మున్సిపాలిటీ ఆదాయం కూడా వస్తుందని ఆమె చెప్పారు. మున్సిపల్ కమీషనర్ హన్మమంతరెడ్డి మాట్లాడుతూ చెత్తను తగలబెట్టకుండా ప్లాస్టిక్ నుంచి ఉత్పత్తులు తయారు చేయడం



వెనుక చాలా శ్రమ ఉందని మున్సిపల్ కార్మికులు పారిశుద్ధ్య విభాగం మరియు అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయడం వల్ల ఇది సాధ్యమవుతుందని అన్నారు. చెత్త ను వేరుచేసి మున్సిపాలిటీ కి అందజేస్తున్న ప్రజలకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ షఫి వుల్లా, ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ కౌన్సిలర్లు నాగుల వాసు, బండారు వెంకన్న పాల్గొన్నారు.

## 'దేవాన్ష్ ఘాట్'పై మంత్రి లోకేశ్ సీరియస్..

ఏపీలో 2027లో జరగనున్న గోదావరి పుష్కరాల కోసం ఏర్పాటు చేస్తున్న ఓ ఘాట్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మనవడు నారా దేవాన్ష్ పేరు పెట్టడం తీవ్ర వివాదానికి దారితీసింది. ఈ విషయంపై ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా స్పందించారు. ఇది చాలా హాస్యాస్పదమని వ్యాఖ్యానిస్తూ, ఆ పేరును వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో ఇలాంటివి తగవని ఆయన స్పష్టం చేశారు.

**అసలేం జరిగింది?**

తూర్పుగోదావరి జిల్లా, సీతానగరం మండలం మునికూడలిలో గోదావరి పుష్కరాల కోసం ఘాట్‌ను సిద్ధం చేస్తున్నారు. ఈ ఘాట్‌కు 'దేవాన్ష్ ఘాట్' అని పేరు పెట్టారు. ఇటీవల జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఈ ఘాట్‌ను పరిశీలించి, దీనిని 'మోడల్ గ్రామీణ పుష్కర ఘాట్'గా అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఈ ఘాట్ వద్ద దేవాన్ష్ పేరుతో ఉన్న బోర్డు ఫొటోలు, వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ప్రభుత్వ కార్యక్రమానికి సీఎం కుటుంబ సభ్యుడి పేరు పెట్టడంపై నెటిజన్ల నుంచి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ఈ వివాదం మంత్రి నారా లోకేశ్ దృష్టికి వెళ్లడంతో ఆయన తక్షణమే స్పందించారు. ఏ ఘాట్‌కు కూడా దేవాన్ష్ పేరు పెట్టకూడదని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ విషయాన్ని తన దృష్టికి తీసుకొచ్చిన వారికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వంలో జవాబుదారీతనం, పారదర్శకత ముఖ్యమని చెప్పకనే చెప్పారు.

**ఘాట్ అభివృద్ధి పనులు**

ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం మునికూడలిలోని ఈ ఘాట్‌ను ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దుతున్నారు. ప్రస్తుతం 49 మీటర్లుగా ఉన్న ఘాట్‌ను 84 మీటర్లకు విస్తరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జూన్ 24న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటన నాటికి పనులు పూర్తి చేయాలని సూచించారు. భక్తుల కోసం తాగునీరు, దుస్తులు మార్చుకునే గదులు, మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు వంటి సదుపాయాలు ఏర్పాటు చేయాలని కూడా స్పష్టం చేశారు. అయితే, కలెక్టర్ పరిశీలన తర్వాత ఈ పేరు వివాదం బయటకు రావడం, దానిపై మంత్రి లోకేశ్ తక్షణమే స్పందించి ముగింపు పలకడం

## ఏలియన్ సిగ్నల్స్ శాస్త్రవేత్తల కొత్త ప్రణాళిక!

విశ్వంలో ఎక్కడైనా గ్రహాంతరవాసులు ఉన్నారా? వారి నుంచి ఏదైనా సంకేతం మనకు అందితే ఆ విషయాన్ని ప్రపంచానికి ఎలా ప్రకటించాలి? ఈ కీలకమైన అంశంపై అంతర్జాతీయ ఏరోనాటిక్స్ అకాడమీ (ఐఏఏ) తాజాగా కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. సోషల్ మీడియా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సృష్టిస్తున్న డీప్‌ఫేక్‌లు, 24 గంటల వార్తా ప్రసారాల నేపథ్యంలో తప్పుడు సమాచారం లేదా పుకార్లు వ్యాపించకుండా ఉండేందుకు ఈ కొత్త నిబంధనలను రూపొందించారు. అయితే, ఇప్పటివరకూ గ్రహాంతరవాసుల నుంచి ఎలాంటి ధ్రువీకరించిన సంకేతం అందలేదని శాస్త్రవేత్తలు మరోసారి స్పష్టం చేశారు. కేవలం భవిష్యత్తులో అలాంటి పరిస్థితి ఎదురైతే ఎలా వ్యవహరించాలనే దానిపైనే ఈ ప్రణాళిక సిద్ధం చేశారు. సుమారు 15 ఏళ్ల క్రితం రూపొందించిన పాత నిబంధనల స్థానంలో ఈ కొత్త ప్రొటోకాల్స్‌ను తీసుకొచ్చారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో ఒక చిన్న వార్త కూడా నిమిషాల్లో ప్రపంచమంతా వ్యాపిస్తున్నందున, గ్రహాంతరవాసుల ఉనికికి సంబంధించిన వార్త గందరగోళానికి, భయాందోళనలకు దారితీయకుండా చూడటమే ఈ మార్గదర్శకాల ముఖ్య ఉద్దేశం. ఒకవేళ ఏదైనా అనుమానాస్పద



సంకేతం అందితే, దాన్ని బహిరంగంగా ప్రకటించే ముందు కఠినమైన శాస్త్రీయ ప్రక్రియను పాటించాలని ఈ నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి.కొత్త మార్గదర్శకాల ప్రకారం, ఏదైనా సంకేతం అందితే, దాన్ని ప్రపంచానికి ప్రకటించడానికి ముందు పలు స్వతంత్ర శాస్త్రవేత్తల బృందాలు క్షుణ్ణంగా పరిశీలించి, అది నిజంగా గ్రహాంతర జీవుల నుంచే వచ్చిందని నిర్ధారించాలి. ఈ పరిశోధనకు సంబంధించిన డేటాను ఇతర శాస్త్రవేత్తలతో పారదర్శకంగా పంచుకోవాలి. ఈ ప్రక్రియలో పాల్గొనే శాస్త్రవేత్తలు మీడియా, ప్రజల నుంచి తీవ్రమైన ఒత్తిడి, విమర్శలు, వేధింపులను ఎదుర్కొనే అవకాశం ఉన్నందున, వారికి పూర్తిస్థాయిలో మద్దతు ఇవ్వాలని కూడా ఈ మార్గదర్శకాలు సిఫార్సు చేస్తున్నాయి. గత కొన్ని దశాబ్దాలుగా 'సెర్చ్ ఫర్ ఎక్స్‌ట్రాటెరెస్ట్రియల్ ఇంటెలిజెన్స్' (ఎస్ఈటీఐ) వంటి సంస్థలు గ్రహాంతరవాసుల సంకేతాల కోసం అన్వేషిస్తున్నప్పటికీ, ఇప్పటివరకు ఒక్కటీ ధ్రువీకరణ కాలేదు. 1977లో అందిన "వావ్! సిగ్నల్" వంటివి ఇప్పటికీ మిస్టరీగానే మిగిలిపోయాయి. ఒక్కోసారి సాధారణ ఖగోళ పరిశోధనల్లో కూడా ఇలాంటి సంకేతాలు తారసపడవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. అందువల్ల, పుకార్లకు తావివ్వకుండా, ధృవీకరించిన వాస్తవాలను మాత్రమే ప్రపంచానికి తెలియజేయాలనే లక్ష్యంతో ఈ కొత్త, పటిష్టమైన ప్రణాళికను రూపొందించారు.

## చెరువులను వదలని ధనికులు: రేవంత్ రెడ్డి ఫైర్

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన హైడ్రా, ఈగిల్ ఫోర్స్ విభాగాలు నేడు దేశవ్యాప్తంగా అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా ఈ ఏజెన్సీలు పనిచేస్తున్నాయని ఆయన స్పష్టం చేశారు. శనివారం బెంగళూరులో నిర్వహించిన 'ది హిందూ హడిల్' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ అంశాలపై ప్రసంగించారు. చెరువులు, కుంటలు, ప్రభుత్వ భూములను అక్రమ కట్టడాల నుంచి కాపాడేందుకు 2024 జులైలో హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ)ను ఏర్పాటు చేసినట్లు ముఖ్యమంత్రి వివరించారు. సీనియర్ ఐపీఎస్ అధికారుల నేతృత్వంలో, రిటైర్డ్ ఆర్మీ సిబ్బందితో కలిపి సుమారు 3,000 మంది సిబ్బందితో పనిచేస్తున్న ఈ ఏజెన్సీ, ఇప్పటివరకు రూ. 1 లక్ష కోట్లకు పైగా విలువైన ప్రభుత్వ ఆస్తులను కాపాడిందని తెలిపారు. "గతంలో పలుకుబడి ఉన్నవారు విల్లాలు, ఫామ్‌హౌస్‌ల కోసం జలవనరులను కబ్జా చేసేవారు. ఇప్పుడు ఆ సాహసం ఎవరూ చేయడం లేదు" అని రేవంత్ రెడ్డి వివరించారు. పేదలు చెరువులను కబ్జా చేస్తే అర్థముంది.. కానీ ధనికులు కూడా చెరువులను ఆక్రమిస్తే ఏమనాలి? అంటూ వ్యాఖ్యానించారు.

# వ్యాపారస్తులకు అండగా వుంటాను

*** ఎపిసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి**



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: సూర్యాపేట పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు తాను మొదటి ప్రాధాన్యత ఇస్తానని ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి సూర్యాపేట ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు, జిల్లా కాంగ్రెస్ నాయకులు మొరిశెట్టి లక్షాదితో కలిసి ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి మాట్లాడుతూ వ్యాపారస్తులకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని అన్నారు. కుల సంఘాల విషయంలో , అసోసియేషన్ ల ఎన్నికల విషయంలో తాను ఎప్పుడూ జోక్యం చేసుకోనని అన్నారు. వివిధ సంఘాలకు ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజలు ఇష్టప్రకారం ఓటు వేసి గెలిపించినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం గెలుస్తుందని ఆయన అన్నారు. పట్టణంలో ఎవరైనా వ్యాపారస్తులను బెదిరిస్తే తాను సహించబోనని అటువంటి వారిపై కఠినంగా వ్యవహరిస్తానని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ వ్యాపారాలు స్వేచ్ఛగా చేసుకునే విధంగా సూర్యాపేటలో ప్రశాంతమైన వాతావరణం కల్పించడానికి తాను ఎల్లప్పుడూ కృషి చేస్తానని అన్నారు. తమకు గతంలో కేటాయించిన స్థలం గురించి ఆర్యవైశ్య సంఘం నాయకులు అడిగినప్పుడు గతంలో మంత్రిగా పనిచేసిన జగదీశ్ రెడ్డి అనేక కుల సంఘాలకు స్థలాలు ఇస్తున్నట్లు శంకుస్థాపన చేశారని, కానీ అవేవీ ప్రభుత్వ రికార్డులో నమోదు కాలేదని ఆయన అన్నారు. ప్రభుత్వ రికార్డులలో నమోదయితే తప్పకుండా సహాయం చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఉప్పల సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాచకొండ శ్రీనివాస్, నాయకులు బిక్కుమళ్ల కృష్ణ, జూలకంటి నాగరాజు, సుమన్ వెంకన్న, మిట్టపల్లి రమేష్, బోనగిరి కృష్ణ, దోగుపర్తి ప్రవీణ్, కుంచపర్తి రాజశేఖర్, సోమ ప్రవీణ్, రాచర్ల సత్యం, బెలిదె శ్రీనాథ్, కంది బండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# రుతుపవనాల నేపథ్యంలో వరి కొనుగోళ్లు వేగవంతం చేయాలి

*** సీఎస్ రామకృష్ణారావు.**




జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లాలో మరో రెండు రోజుల్లో రుతుపవనాలు ప్రవే శించే అవకాశం ఉన్నందున వరి కొను గోలు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు కలెక్టర్లకు ఆదేశించారు. శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో వరి కొనుగోళ్లు, జూన్ 9న హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే మండల మహిళా సమాఖ్యలకు ఆర్టీసీ బస్సుల పంపిణీ కార్యక్రమంపై సమీక్షించారు. జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ (రెవె న్యూ) బెన్షాలోంతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులు, గోదాములకు తర లించి రెండు మూడు రోజుల్లో కొను గోలు ప్రక్రియ పూర్తి చేయాలని సీఎస్ సూచించారు. జూన్ 9న జరిగే ఆర్టీసీ బస్సుల పంపిణీ కార్యక్రమానికి మహి ళా సంఘాల సభ్యులను సకాలంలో హైదరాబాద్‌కు తరలించేలా ఏర్పాట్లు చేయాలని, మార్గమధ్యంలో భోజనం, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పించా లని ఆదేశించారు. నీట్ పరీక్ష నిర్వహణ కు పకడ్బందీ ఏర్పాట్లు చేసి, కట్టుదిట్ట మైన భద్రతా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో విద్యాశాఖ ఏడీ శ్రీనివాస్, డీసీఓ కరుణ, ఏసీపీ భీం శర్మ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఇంద్రానగర్ కాలనీలో బోర్‌మోటార్ ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : పట్టణంలోని 26వ వార్డు ఇంద్రానగర్ కాలనీలో స్థానిక ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని కొత్తగా ఏర్పాటు చేసిన బోర్‌మోటార్‌ను మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ప్రారంభించారు. సాయి రాజా టాకీస్ సమీపంలో ఏర్పాటు చేసిన ఈ బోర్‌మోటార్‌ను శనివారం ఆయన చేతుల మీదుగా ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ మాట్లాడుతూ, వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ ఎస్పీ శివ, నాగమణి, బొట్టు రాజు, దాసు, ప్రకాష్, జాను, నగేష్, రామచంద్రయ్య, జ్యోతి, మున్సిపల్ సిబ్బంది, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# బాల పంచాయతీలతో సురక్షిత గ్రామాలు

*** బాలల భద్రతకు అందరూ తోడ్పడాలి - ఎస్పీ శ్రీనివాస రావు**




ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా : తెలంగాణ రాష్ట్రంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక99 రోజుల కార్యక్రమంలో భాగంగా బాలల భద్రత వారోత్సవాల సందర్భంగా శనివారం పాపన్నపేట మండలంలోని మంజీరా ఫంక్షన్ హాల్లో తెలంగాణ పోలీస్ విమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో, మై ఛాయస్ ఫౌండేషన్, యంగిస్తాన్ స్వచ్ఛంద సంస్థల సహకారంతో బాల పంచాయతీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ, భద్రత, నాయకత్వ లక్షణాల అభివృద్ధికి బాల పంచాయతీలు సమర్థవంతమైన వేదికలుగా నిలుస్తాయని అన్నారు. గ్రామాల్లోని బాలబాలికల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనిచేసేలా బాల పంచాయతీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బాలల భద్రత, విద్య, ఆరోగ్యం, పరిశుభ్రత, బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన వంటి అంశాలపై బాల పంచాయతీ ప్రతినిధులు దృష్టి సారించాలని సూచించారు. గ్రామాభివృద్ధి, బాలల సంక్షేమంలో పిల్లలను భాగస్వాములను చేయడం ద్వారా వారిలో నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. బాల పంచాయతీ సభ్యులు గుర్తించిన సమస్యలను అధికారులు సానుకూలంగా స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సూచించారు. బాలల అనుకూల వాతావరణం కల్పించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామ ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీడబ్ల్యూసీ చైర్మన్ ఉప్పలయ్య, డీసీపీఓ నాగరాజు, సీసీఎస్ సీఐ రాజశేఖర్ రెడ్డి, సీఐడీ ఉమెన్ సేఫ్టీ వింగ్ సీఐ రాజేష్, రూరల్ సీఐ జార్జ్, యంగిస్తాన్ ఫౌండేషన్ ప్రతినిధి వృత్విక, విజన్ ఎన్‌జీఓ ప్రతినిధులు రాజు, యాదగిరి, తహసీల్దార్ సతీష్, ఎంపీడీఓ విష్ణువర్ధన్, పీఎం శ్రీ పాపన్నపేట ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మహేష్, నాయకులు శ్రీకాంత్ అప్ప, మాజీ సర్పంచ్ గురుమూర్తి గౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, బీజేపీ మాజీ మండల అధ్యక్షులు రాములు, కిష్టయ్య, నాయకులు శివయ్య, సంగమేష్, ప్రసాద్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, వివిధ గ్రామాల విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 9న టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా జర్నలిస్టుల సమావేశం



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): జర్నలిస్టుల వృత్తి భద్రత, సంక్షేమం, హక్కుల పరిరక్షణతో పాటు జిల్లాలోని పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలనే లక్ష్యంతో తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే-ఐజేయూ) జయశంకర్ భూపాలపల్లి జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 9 న కాళేశ్వరంలో జిల్లా స్థాయి జర్నలిస్టుల సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి సామంతుల శ్యామ్ తెలిపారు.మంగళవారం ఉదయం 10 గంటలకు జరగనున్న ఈ మహాసభకు సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వేణుమాధవ్, కంకనాల సంతోష్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.ఈ సందర్భంగా జర్నలిస్టుల అక్రిడిటేషన్లు, హెల్త్ కార్డులు, గృహ స్థలాల కేటాయింపు, పెన్షన్, బీమా సదుపాయాలు, సంక్షేమ పథకాలు, వృత్తిపరమైన సమస్యలు, మీడియా రంగంలో నెలకొంటున్న సవాళ్లు, డిజిటల్ మీడియా యుగంలో జర్నలిస్టుల బాధ్యతలు వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చించనున్నట్లు తెలిపారు. అలాగే జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై తీర్మానాలు ఆమోదించి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలను ఒకే వేదికపై చర్చించి వాటి పరిష్కారానికి సమిష్టి పోరాట కార్యాచరణ రూపొందించడంతో పాటు సంఘ బలోపేతం, సభ్యత్వ నమోదు, జర్నలిస్టుల ఐక్యత, వృత్తి గౌరవ పరిరక్షణ, యువ జర్నలిస్టులకు ప్రోత్సాహం వంటి అంశాలపై ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నట్లు వివరించారు. జర్నలిస్టుల సంక్షేమం, హక్కుల సాధన, వృత్తి పరిరక్షణ దిశగా కీలక మైలురాయిగా నిలవనున్న ఈ మహాసభకు జిల్లాలోని జర్నలిస్టులందరూ పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలు, అభిప్రాయాలు, సూచనలు వెల్లడించి సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు

# పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి :ప్రపంచ పర్యావరణ దినోత్సవము సందర్భంగా శనివారం క్లీన్ హోమ్ గ్రీన్ హోమ్ ప్రోగ్రాం ఆర్గనైజర్ ఆదిమల్ల మణిరాజు ఆధ్వర్యంలో, ఫారెస్ట్ డిపార్ట్మెంట్ అలాగే కాలుష్య నియంత్రణ మండలి వారితో కలిసి పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అనే విషయంపై కాలుష్యం నివారణ ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపన అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నల్గొండ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఏ వీరేంద్రబాబు మొక్క నాటి మాట్లాడుతూ పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు చెట్లే మనకు ప్రాణాధారం చెట్లే మనకు జీవనాధారం అందుకే మనందరం కనీసం మనిషికి ఒక చెట్టు అయినా నాటి సంరక్షించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పట్టణ ప్రజలను కోరారు. నల్గొండ కాలుష్య నియంత్రణ మండలి శంకర్ బాబు మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజ స్థాపనే ముఖ్య లక్షణంగా ముందుకు సాగాలని కాలుష్య నియంత్రణలో భాగంగా ప్రతి ఒక్కరు ఎలక్ట్రిక్ వాహనాలను ఉపయోగించాలన్నారు. సింగిల్ యూ స్ ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని ప్రజలు వాటిని వాడరాదని పట్టణ ప్రజలకు సూచించారు అదే మాదిరిగా డాక్టర్ పుల్లారావు మాట్లాడుతూ ప్రస్తుతము గాలి నీరు ఆహార పదార్థాలు విపరీతంగా కలుషితం మవుతున్నాయి కాబట్టి ప్రజలందరూ అప్రమత్తంగా ఉండి కాలుష్యాన్ని నిరోధిస్తూ స్వచ్ఛమైన గాలిని స్వచ్ఛమైన నీటిని స్వచ్ఛమైన ఆహార పదార్థాలను తీసుకుంటూ ఆరోగ్యంగా జీవించాలని పట్టణ ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బి రవీందర్ సెక్షన్ ఆఫీసర్లు మల్లేష్ ఏ ఎల్లేష్ మరియు బీట్ ఆఫీసర్లు కాలుష్యం నియంత్రణ మండలి నల్గొండ నుండి రవీందర్ వారి టీం నాగార్జున డిగ్రీ కళాశాల మైదాన వాకర్స్ అసోసియేషన్ సభ్యులు భీమ్ అర్జున్ రెడ్డి చింతపల్లి వెంకన్న బర్రె సుదర్శన్ ఆర్ఐ గౌస్ పి.డి శంభు యువతి యువకులు మరియు విద్యార్థులు మరియు ముఖ్యంగా పత్రికా విలేకరులు ఫోటోగ్రాఫర్లు మొదలగు వారు పాల్గొన్నారు

# ప్రజల వద్దకే వెళ్లి సమస్యల పరిష్కారం


*** గుర్రంపేట ప్రజాదర్బార్‌లో మంత్రి సీతక్క**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వారి వద్దకే వెళ్లి తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించడమే ప్రజాదర్బార్ కార్యక్రమం లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు.భూపాలపల్లి మండలం గుర్రంపేట రెవెన్యూ పరిధిలోని గ్రామాల ప్రజల సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌లో మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఐటిడిఏ పీవో లెనిన్ వత్సల్ టొప్పో పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ములుగు నియోజకవర్గంలో ఇప్పటివరకు 70 గ్రామాల్లో ప్రజాదర్బార్‌లు నిర్వహించామని, ప్రజలు వినిపించిన సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే లక్షకు పైగా పెన్షన్లు అందించామని, మహిళా సంఘాలకు భారీ స్థాయిలో వడ్డీలేని రుణాలు అందిస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాల సభ్యులకు బీమా సౌకర్యాలు, కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ, రైతుల ధాన్యం కొనుగోళ్లను ప్రభుత్వం ప్రాధాన్యంగా అమలు చేస్తోందన్నారు.ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులను పరిశీలించి 10 రోజుల్లో మంజూరు చేస్తామని, అవసరమైతే అదనపు ఇళ్లు కూడా కేటాయిస్తామని తెలిపారు. ఒంటరి మహిళలు, వృద్ధులకు తొలి విడతలోనే పెన్షన్లు అందజేస్తామని, గ్రామీణ రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు.జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ 99 రోజుల ప్రణాళికలో భాగంగా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

# గ్రామసభలు ప్రజల అవసరాలను నేరుగా తెలుసుకునే వేదికలు

*** భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి):గ్రామాల సమస్యలను గ్రామస్థుల సమక్షంలో గుర్తించి, వాటికి శాశ్వత పరిష్కారాలు చూపడమే ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక ప్రధాన ఉద్దేశమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం కొత్తపల్లి గోరి మండలంలోని విజయపల్లి గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే పాల్గొని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభలు ప్రజల అవసరాలను నేరుగా తెలుసుకునే వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని స్పష్టం చేశారు. తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, రహదారులు, విద్య వంటి మౌలిక సదుపాయాలపై ప్రజల అభిప్రాయాలను సేకరించి, వాటి ఆధారంగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు. అలాగే పెన్షన్లు, రేషన్ కార్డులు, రైతు సంక్షేమ పథకాలు తదితర ప్రభుత్వ పథకాలు అర్హులందరికీ చేరుతున్నాయో లేదో గ్రామస్థులే పర్యవేక్షించాలని సూచించారు.

# ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

*** భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, (ప్రజా స్ఫూర్తి): గ్రామీణ ప్రాంతాల ప్రజల ఎన్నో ఏళ్ల నిరీక్షణకు తెరపడింది. చిన్నకోడెపాక-కొప్పుల-వసంతపూర్ మీదుగా ప్రగతి సింగారం వరకు నడిచే కొత్త ఆర్టీసీ బస్సు సర్వీసును శనివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఘనంగా ప్రారంభించారు. పరకాల డిపోకు చెందిన ఈ బస్సుకు జెండా ఊపి ప్రారంభించిన ఎమ్మెల్యే, అనంతరం ప్రయాణికులతో కలిసి టికెట్ తీసుకుని కొంతదూరం ప్రయాణించి ప్రజలతో మమేకమయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అన్నారు. చిన్నకోడెపాక, కొప్పుల, వసంతపూర్, ప్రగతి సింగారం గ్రామాల ప్రజలు చాలా కాలంగా బస్సు సౌకర్యం కోసం ఎదురుచూస్తున్నారని, వారి అభ్యర్థన మేరకే ఈ కొత్త సర్వీసును అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కొత్త బస్సు సర్వీసు ప్రారంభాన్ని స్వాగతించారు.

# ఆదర్శ పాఠశాలల హాస్టళ్లలో 8 నాన్ టీచింగ్ పోస్టులు

*** జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**

జనగామ,ప్రజాస్ఫూర్తి : జిల్లా లోని నాలుగు టైప్ IV ఆదర్శ పాఠశాలల బాలికల హాస్టళ్లలో ఖాళీగా ఉన్న 8 నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి అర్హత గల మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తు లు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి సందీప్ కుమార్ ఝా తెలిపారు. అవుట్ సోర్సింగ్ విధానంలో ఈ నియామకాలు చేపట్టనున్నారు.కొడకండ్ల, జఫర్‌గడ్, స్టేషన్ ఘన్‌పూర్, బచ్చన్నపేట ఆదర్శ పాఠశాలల్లో ఏఎన్ఎం, కేర్ టేకర్ కమ్ వార్డెన్, హెడ్ కుక్, అసిస్టెంట్ కుక్, వాచ్ ఉమెన్ పోస్టులు ఖాళీగా ఉన్నా యి. అభ్యర్థుల వయస్సు 40 సంవత్స రాల లోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు 5 సంవత్సరాలు, దివ్యాం గులకు 10 సంవత్సరాల వయోపరిమి తి సడలింపు ఉంటుంది. ఆసక్తి గల మహిళా అభ్యర్థులు విద్యార్హతల ధృవ పత్రాలు, జిరాక్స్ ప్రతులతో కూడిన దరఖాస్తులను జూన్ 10 సాయంత్రం 5 గంటలలోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం, జనగామ లో సమర్పిం చాలని సూచించారు. స్థానిక మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు అధికారులు తెలిపారు.

# వేగవంతంగా ధాన్యం కొనుగోలు


**: ధర్మోజి గూడెం ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన**

*** చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, ధర్మోజీగూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మా**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: ధాన్యం కొనుగోలు వేగవంతంగా జరుగుతున్నాయని.. చివరి గింజ వరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, ధర్మోజీగూడెం సర్పంచ్ జువ్వి నర్సింహ్మాలు అన్నారు. చౌటుప్పల్ మండలం ధర్మోజీగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం వారు సందర్శించారు. ధాన్యం కొనుగోళ్ళను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం పూర్తిగా కొనుగోలు చేస్తుందన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వేగంగా కొనుగోలు సాగుతున్నాయన్నారు. త్వరలోనే పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు పూర్తవుతాయన్నారు. ధాన్యం నిల్వలకు వీలుగా ధర్మోజిగూడెం పరిధిలోనే ఒక గోదామును ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య గౌడ్, మండల అధ్యక్షుడు బోయ దేవేందర్, వీరమళ్ళ సత్తయ్య గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బత్తుల శ్రీహరి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాచకొండ భార్గవ్, గ్రామ ఉప సర్పంచ్ పక్కీరు శ్రీనివాస్ రెడ్డి, గ్రామ వార్డు సభ్యులు ఊదరి శ్రీనివాస్, ఐతరాజు శారద లింగస్వామి, జీడిమడ్ల శోభ కొండల్, గునుగంటి వెంకటేశం గౌడ్, మాజీ ఉపసర్పంచ్ కొంతం బుచ్చి రెడ్డి, ఊదరి లింగయ్య, ఊదరి పెంటయ్య, కొంతం కృష్ణారెడ్డి, పగిళ్ళ లింగారెడ్డి, ఏనుగు ఇస్తారీ రెడ్డి, ఏనుగు లింగారెడ్డి, ఊదరి ఎల్లయ్య, జక్కలి యాదయ్య, జక్కలి మల్లయ్య, చేన్నోజు విజయ చారి, ఊదరి స్వామి, డాకోజీ సతీష్, ఊదరి కృష్ణమూర్తి, గ్రామ ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## కోహెడ రైతు మహోత్సవానికి తరలి వెళ్లిన ఫరూక్‌నగర్ మండల రైతులు



ప్రజాస్ఫూర్తి , షాద్నగర్ : అబ్దులాపుర్‌మెట్ మండలంలోని కోహెడ గ్రామంలో శనివారం నిర్వహించనున్న చారిత్రాత్మక రైతు మహోత్సవానికి ఘన ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఫరూక్‌నగర్ మండలంలోని రైతులు, ప్రజాప్రతినిధులు, సర్పంచులు, వ్యవసాయ రంగానికి చెందిన ప్రతి ఒక్కరూ పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేశారు. ఈ సందర్భంగా మండల అధికారులు మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయ రంగ అభివృద్ధికి మైలురాయిగా నిలిచే ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా సుమారు 239 ఎకరాల విస్తీర్ణంలో రూ.3,300 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న దేశంలోనే అతిపెద్ద అంతర్జాతీయ సమీకృత పండ్లు, కూరగాయల మార్కెట్ నిర్మాణానికి భూమిపూజ, శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతుల రవాణా సౌకర్యం కోసం ఫరూక్‌నగర్ మండలం నుంచి 15 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రైతులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ, మండల వ్యవసాయ అధికారి విజ్ఞప్తి చేశారు. రైతు బాగుంటేనే రాష్ట్రం బాగుంటుంది – అన్నదాతల అభ్యున్నతే ప్రభుత్వ తొలి ప్రాధాన్యత” అనే సందేశంతో రైతు మహోత్సవం నిర్వహించబడుతోంది.

## గోదావరి వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**: జిల్లా కలెక్టర్ అంకిత్**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గోదావరి వరదల నేపథ్యంలో ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, తదితర అధికారులతో కలిసి గోదావరి వరదల సన్నద్ధతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరదల వల్ల ముంపునకు గురయ్యే గ్రామాలను ముందుగానే గుర్తించి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలు, డ్రెయిన్ల శుభ్రత, మంచినీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. 73 అడుగుల వరకు గోదావరి వరదలు వచ్చినా ఎదుర్కొనే విధంగా అన్ని శాఖలు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట మాట్లాడుతూ ముంపు గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## పోచంపల్లి చేనేత కళ కు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉంది

*** భారీ నీటి పారుదల, సివిల్ సప్లై మంతి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



భువనగిరి, ప్రజాస్ఫూర్తి : పోచంపల్లి చేనేత కళ కు ప్రపంచ వ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని భారీ నీటి పారుదల, సివిల్ సప్లై మంతి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం హైటెక్స్ లో ఏర్పాటు చేసిన థ్రెడ్ పోచంపల్లి చేనేత ఎగ్జిబిషన్ కు మంత్రి విచ్చేసి ఎగ్జిబిషన్ లో ఏర్పాటు చేసిన చేనేత స్టాల్స్ ను మంత్రి సందర్శించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పోచంపల్లి చేనేత కళా వైభవాన్ని ప్రపంచానికి మరింత చేరువ చేసే లక్ష్యంతో హైదరాబాద్లోని హైటెక్స్లో జూన్ 7 వరకు నిర్వహిస్తున్నారని మంత్రి అన్నారు.చేనేత కార్మికుల అపూర్వ నైపుణ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు వారికి మెరుగైన మార్కెట్ అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.మాదాపూర్ హైటెక్స్ లో “పోచంపల్లి థ్రెడ్ “ ఎగ్జిబిషన్ కార్యక్రమానికి తెలంగాణ శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హాల్ లోని స్టాల్స్ అన్నింటిని ఆయన సందర్శించి , వర్తకులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ “ పోచంపల్లి వస్త్రాలకు ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి ఉందన్నారు. తాను ఎంపీగా ఉన్న కాలంలో పోచంపల్లి శాలువలను ఢిల్లీలో సహచర ఎంపీలు , కేంద్ర మంత్రులకు కప్పి భూదాన్ పోచంపల్లి వస్త్రాల గొప్పతనాన్ని వివరించే వాడినని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జగన్నాథం, జిల్లా చేనేత అధికారి శ్రీనివాస్, లో సంబధిత అధికారులు పాల్గొన్నారు.

## ధాన్యం రవాణా వేగవంతం చేయాలి

**: జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**



జనగామ,ప్రజాస్ఫూర్తి : వర్షాల నేపథ్యం లో ధాన్యం కొనుగోలు, రవాణా ప్రక్రియ ను మరింత వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధి కారులను ఆదేశించారు. శనివారం జిల్లా సమీకృత కలెక్టరేట్ లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లా డుతూ జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు చివరి దశకు చేరుకున్నాయని, ఇప్ప టికే 57 కొనుగోలు కేంద్రాల్లో కొను గోళ్లు పూర్త య్యాయని తెలిపారు. ప్రతి కేం ద్రం ,మిల్లు వారీగా కొనుగోలు, రవాణా, అన్లోడింగ్,లోడింగ్ ప్రక్రియల పై సమగ్రం గా సమీక్ష నిర్వహించారు. అదనపు వా హనాల సర్దుబాటుపై అధికారులు ప్ర త్యేక దృష్టి సారించి, కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని వెంటనే మిల్లులకు త రలించేలా చర్యలు చేపట్టాలని సూచిం చారు. రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేసి ట్యాగ్ చేసిన మిల్లులకు సకాలంలో తరలించాలని, ధాన్యం కొనుగోలు, రవాణా విషయం లో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. గోదాములు, మిల్లుల వద్ద లారీలు, ట్రాక్టర్లు నిలిచిపోకుండా త్వరితగతిన దిగుమతి అయ్యేలా చూ డాలని అధికారులను ఆదేశించారు. పౌ రసరఫరాలు,రవాణా, మార్కెటింగ్ తది తర శాఖల అధికారులు క్షేత్రస్థాయి లో నిరంతరం పర్యవేక్షణ చేపట్టి కొనుగోలు,రవాణా ప్రక్రియలో వేగం పెంచాలని క లెక్టర్ సూచించారు. సమావేశంలో అద నపు కలెక్టర్ బెన్ షా లోమ్, డీసీఓ కరు ణ, డీ.ఎం హతిరామ్, డీ.ఎం.ఓ రామ కృష్ణ, డీ.సీ. ఎస్.ఓ సురేష్‌రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.


## మా ఇంటిని కబ్జా చేయడానికి కొందరు ప్రయత్నం చేస్తున్నారు

*** ఇంటి నిర్మాణం అడ్డుకుంటె మాకు చావు తప్ప మరొక దారి లేదు**



ప్రజా స్ఫూర్తి, సూర్యా పేట : సూర్యాపేట పట్టణంలోని భగత్ సింగ్ నగర్ లో సర్వే నెంబరు 219 లో 200 గజాల స్థలంలో నిర్మాణం చేస్తున్న ఇంటికి మున్సిపాలిటీ అధికారులు వచ్చి నిర్మాణం ఆపాలని తెలియజేస్తున్నారని అందువల్ల తమ కుటుంబ సభ్యులం తీవ్రమైన మనోవేదన చెందుతున్నామని, తనకు ఆత్మహత్యే శరణ్యమని దొంతగాని వసంత అన్నారు. శనివారం నిర్మాణం జరుగుతున్న తన ఇంటి వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో దారోజు భాగ్యరాజ్, భీమార్జున్ రెడ్డి, విజయమ్మ, వెంకన్న లతో కలిసి మాట్లాడుతూ తాను 2020లోనే ఇక్కడ స్థలం కొని ఇంటి నిర్మాణం మొదలు పెట్టామని ప్రతి సంవత్సరము మున్సిపాలిటీ కి ఇంటి పన్ను కడుతున్నామని, అన్ని రకాల డాక్యుమెంట్లు వున్నాయని చెప్పారు. కొందరు నకిలి పత్రాలతో కోర్టులో కేసు వేశారని అయితే తాము 2025లో కోర్టులో కేసు గెలవడం జరిగిందని , తర్వాత ఇంటి నిర్మాణం చేస్తున్నామని, అయితే ఇటీవల మున్సిపాలిటీ అధికారులు వచ్చి నిర్మాణం చేయడానికి అనుమతులు లేవని హెచ్చరిస్తున్నారని వారు తెలిపారు. ఈ సందర్భంగా భాగ్యరాజ్ మాట్లాడుతూ 1982 నుంచి 2020 వరకు ఈ స్థలం సురకంటి భీమార్జున్ రెడ్డి తల్లి విజయమ్మ పేరు మీద ఉందని 2020లో దారోజు శారదకి తరువాత దొంతగాని వసంతకు అమ్మడం జరిగిందని అన్నారు. ఇంటి నంబర్ వచ్చిందని, మున్సిపాలిటీలో రెగ్యులర్ గా ఇంటి పన్ను కడుతున్నామని చెప్పారు. అయితే కొందరు కావాలని తమను వేధిస్తున్నారని అటువంటి వారు కోర్టు కేసులో కూడ ఎన్నడూ హాజరు కాలేదని కానీ ఇటీవల మున్సిపాలిటీకి వెళ్లి అధికారులను బెదిరించి నిర్మాణం చేయకుండా అడ్డుకుంటున్నారని వారు తెలిపారు. కాబట్టి తమకు న్యాయం చేయాలని వారు అన్నారు. ఇప్పటికే ఇంటి నిర్మాణం కోసం చాలా ఖర్చు చేశామని, నిర్మాణం చేయడం అడ్డుకుంటే తమ కుటుంబానికి ఆత్మహత్య చేసుకోవడం తప్ప మరొక దారి లేదని చెప్పారు.

## వికలాంగులకు ఉచిత వీల్ చైర్ల పంపిణీ



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్‌లో 20 మంది వికలాంగులకు ఉచిత వీల్‌చైర్ల పంపిణీ చేసిన బీజేపీ నాయకులు డా. ధరంసోత్ సీతారాం నాయక్.మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎస్.ఆర్. ఫంక్షన్ హాల్‌లో మహబూబాబాద్ జిల్లా నాయకులు డాక్టర్ ధరంసోత్ సీతారాం నాయక్, పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సేవ్యా నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వీల్‌చైర్ పంపిణీ కార్యక్రమం విజయవంతంగా జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 20 మంది దివ్యాంగులు,వృద్ధులు, నడవలేని అర్హులైన వికలాంగులకు ఉచితంగా వీల్‌చైర్లు అందజేశారు.ఈ కార్యక్రమానికి జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్, మాజీ ఎంపీ, బీజేపీ నాయకులు ప్రొఫెసర్ అజ్మీరా సీతారాం నాయక్ లు ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు వీల్‌చైర్లను పంపిణీ చేశారు. దివ్యాంగుల సంక్షేమం కోసం పనిచేసే సంస్థలు, సేవాభావం కలిగిన వ్యక్తులు ముందుకు రావడం అభినందనీయమని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ సీతారాం నాయక్ మాట్లాడుతూ సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన దివ్యాంగులు, వృద్ధులకు అవసరమైన సహాయం అందించడం ద్వారా నాకు చాలా సంతృప్తి కలిగించిందని, ఇది ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు హథీరాం నాయక్, రాధ పటేల్, తదితరులు పాల్గొన్నారు.

## బ్యూటీషియన్ రంగానికి మంచి డిమాండ్

*** షాద్ నగర్ మున్సిపల్ కమిషనర్ సునీతారెడ్డి**



ప్రజాస్ఫూర్తి ,షాద్నగర్ : తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కోత్వాల్ ఆధ్వర్యంలో, తెలంగాణ ప్రభుత్వ సహకారంతో ఆమోదించబడిన సెల్ఫ్ ఎంప్లాయ్మెంట్ అడ్వాన్స్ బ్యూటీషియన్ కోర్స్ షాద్ నగర్ మున్సిపల్ లో ఉన్న ఫరూక్‌నగర్‌లో గత మూడు నెలలుగా విజయవంతంగా కొనసాగుతోంది. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చొరవతో ప్రారంభమైన ఈ శిక్షణ కార్యక్రమం సెమినా మహిళా సేవా మండలి అధ్యక్షురాలు ఆలియా సుల్తానా ఆధ్వర్యంలో ఫరూక్‌నగర్ మైనార్టీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహిస్తున్నారు. ఈ కోర్స్‌లో 30 మంది యువతీయులు శిక్షణ పొందుతున్నారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ మున్సిపల్ కమిషనర్ వి. సునీత రెడ్డి శిక్షణ కేంద్రాన్ని సందర్శించి, విద్యార్థినులు నేర్చుకున్న నైపుణ్యాలు, వారు నిర్వహించిన ప్రాక్టికల్ పనులు, హెయిర్ స్టైలింగ్ నమూనాలను పరిశీలించి అభినందించారు. విద్యార్థినులతో మాట్లాడిన కమిషనర్ సునీత మాట్లాడుతూ, ప్రస్తుతం బ్యూటీషియన్ రంగానికి మంచి డిమాండ్ ఉందని, ఈ రంగంలో స్వయం ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉన్నాయని తెలిపారు. శిక్షణను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్వావలంబన సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు, శిక్షణ పొందుతున్న యువతీయులు తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, చైర్మన్ ఒబేదుల్లా కోత్వాల్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

## వసుమతి మృతి కి అధికారుల వేధింపులే కారణమా..?

*** సింగరేణి అప్రెంటిస్ యువతి మృతిపై గిరిజన సంఘాల ఆగ్రహం**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: సింగరేణి కొత్తగూడెం ఏరియాలోని పీవీకే-5 ఇంక్లైన్‌లో అప్రెంటిస్‌గా పనిచేస్తున్న గిరిజన యువతి వసుమతి (23) మృతి చెందడం బాధాకరమని గిరిజన సంఘాల నాయకులు పేర్కొన్నారు. ఆమె మృతికి కారణమైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. డిమాండ్లను పట్టించుకోకపోతే వసుమతి కుటుంబ సభ్యులతో కలిసి కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయం ఎదుట భారీ ధర్నా చేపడతామని హెచ్చరించారు.ఈ మేరకు శనివారం సాయంత్రం కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ షాలెంరాజుకు గిరిజన సంఘాల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పురుగుల మందు సేవించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వసుమతి మృతి చెందడం తీవ్ర విషాదకరమన్నారు. వసుమతి కుటుంబానికి ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు చేపట్టాలని కోరారు. వసుమతి కుటుంబానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని గిరిజన సంఘాల నాయకులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య నాగేశ్వరావు, సెంట్రల్ కమిటీ జనరల్ సెక్రటరీ ఏ. భాస్కరరావు, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ భూక్య వెంకట్రావు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ బి. రాందాస్, లైజన్ ఆఫీసర్ జర్పుల లింగా, భూక్య భీముడు, బి. రమేష్, వైస్ ప్రెసిడెంట్ భూక్య తౌర్యానాయక్, ఎస్టేట్ ఆఫీసర్ తరుపుల లింగ తదితరులు పాల్గొన్నారు.

# మహిళల భద్రత ప్రధాన లక్ష్యం

**– గ్రామసభల్లో పోలీస్ అధికారులు**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు జిల్లాలోని వివిధ ప్రాంతాలలో శనివారం గ్రామ సభలు నిర్వహించారు. సుజాతనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సింగభూపాలెం, పాత అంజనాపురం, కొత్త అంజనాపురం, కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 4 ఇంక్లైన్, 3 ఇంక్లైన్, ప్రశాంతినగర్, జూలూరుపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో గుండెపూడి, ఏడుళ్ల బయ్యారం పోలీస్ స్టేషన్ పరిధిలో సింగిరెడ్డిపల్లి, పాత రెడ్డిపాలెం, మణుగూరు మునిసిపాలిటీ, భద్రాచలం గ్రామపంచాయతీలలో గ్రామసభలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల్లో ప్రజలకు, మహిళల భద్రత, మహిళలు, చిన్నారులపై జరిగే నేరాలు, మహిళలకు సంబంధించిన చట్టాలు, సెక్షన్లు, మహిళల సంక్షేమ పథకాలు, పోక్సో చట్టం, షీ బాక్స్ వినియోగం, టి సేఫ్ వినియోగం, షీటీమ్స్, భరోసా సెంటర్ల పాత్ర, బాల్య వివాహాల నివారణ, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించడం జరిగింది. అత్యవసర పరిస్థితిలలో టోల్ ఫ్రీ నెంబర్లు 181, సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930, చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, అత్యవసర సేవల నెంబర్ 112 లకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో పోలీస్ అధికారులు, సిబ్బంది, గ్రామపంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, అంగన్వాడి ఉపాధ్యాయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పెంచిన ఎరువుల ధరను వెంటనే తగ్గించాలి




మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : ఎరువుల ధరలను ప్రైవేటు కంపెనీలు ఇష్టం వచ్చినట్టుగా పెంచారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కంపెనీల మీద నియంత్రణ లేదని దీని ద్వారా స్పష్టంగా తెలుస్తుందని ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జడ సత్యనారాయణ ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుజ్జు దేవేందర్లు మాట్లాడారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బట్టు అంజయ్య భవనంలో అఖిల భారత రైతు కూలి సంఘం ఏఐకేఎంఎస్ జిల్లా కార్యవర్గ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడుతూ ఇప్పటికే డీజిల్, పెట్రోల్ పెరిగి రైతాంగం అనేక కష్టనష్టాలకు ఇబ్బంది పడుతుంటే మూలికే నక్కపై తాటిపండు పడ్డట్లు చందంగా, ప్రైవేటు కంపెనీలు తమ ఇష్టానుసారంగా కాంప్లెక్స్ ఎరువుల ధరలను ఒక బస్తాకు 100 రూపాయల నుండి 500 వరకు పెంచారన్నారు. ఇటీవల కాలంలో కేంద్ర ప్రభుత్వం నామమాత్రంగా పెంచిన ధరలను ఉపసమరించుకోవాలని కల్తీ విత్తనాలు ఎరువులను అరికట్టాలని నాణ్యమైన విత్తనాలు ఎరువులు రైతాంగానికి సరిపడినన్ని అందుబాటులో ఉంచాలని సకాలంలో బ్యాంకులు రైతులకు రుణాలు అందజేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు తోకల వెంకన్న, రామగిరి బిక్షం, చింత వెంకన్న, నున్న ఉపేందర్, దేవ పంగు బిక్షం, పూణెం పాపారావు, మట్టపెల్లి వీరభద్రం, టేకుమట్ల సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# సహకార సంఘం ఆధ్వర్యంలో సబ్సిడీ జీలుగ విత్తనాల పంపిణీ



ప్రజా స్ఫూర్తి, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా: రెబ్బెన మండల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘ కార్యాలయంలో రైతులకు రాయితీపై జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సహకార సంఘ చైర్మన్ కార్నాథం సంజీవ్ కుమార్ మాట్లాడుతూ..ప్రస్తుతం కార్యాలయంలో వంద బస్తాల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని, కావలసిన రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డులను సమర్పించి వీటిని కొనుగోలు చేయవచ్చని తెలిపారు. ఒక్కో బస్తా ధర ప్రభుత్వ సబ్సిడీ పోను 2500 రూపాయలుగా నిర్ణయించినట్లు ఆయన పేర్కొన్నారు. స్థానిక రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో రెబ్బెన సర్పంచ్ దుర్గం భరద్వాజ్, సహకార సంఘ డైరెక్టర్ అజయ్ జైస్వాల్, నారాయణపూర్ సర్పంచ్ మాదాస్ రవీందర్, మాజీ సర్పంచ్ చిన్న సోమశేఖర్, అలాగే కుందారపు శంకరమ్మ, దుర్గారావు, మిట్ట దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

# అనభేరి విగ్రహాన్ని పున:ప్రతిష్టించాలి

*** హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే చాడా వెంకటరెడ్డి**

హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : అనబేరి ప్రభాకర్ రావు విగ్రహ ఏర్పాటుకు హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే సిపిఐ జాతీయ నేత చాడా వెంకట్ రెడ్డీ మున్సిపల్ చైర్మన్ దండీ లక్ష్మి, వైస్ చైర్మన్ చిత్తారీ పద్మ లతో మున్సిపల్ అధికారులుపాలక వర్గం స్థల పరిశీలన చేశారు. హుస్నాబాద్ పట్టణం లోని సిద్దిపేట జాతీయ రహదారి , ఆర్టీసీ డిపో క్రాస్ రోడ్డు లోఅనబేరి ప్రభాకర్ రావు విగ్రహ పునః ప్రతిష్ఠాపన చేయాలని చాడ వెంకటరెడ్డి అన్నారు అందుకు మున్సిపల్ సిబ్బందితో కలిసి స్థల పరిశీలన చేశామని తెలిపారు సీపీఐ హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ, సీపీఐ సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి మాజీ వైస్ ఎంపిపి గడిపే మల్లేష్, గూడ పద్మ, చాడా శ్రీధర్ రెడ్డీ, పొదిల కుమారస్వామి ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జనగాం రాజ్ కుమార్, జంగా విజయా సీపీఐ నాయకులు గంబీరాపు మధు అయిలేని మల్లారెడ్డి, రోళ్ల భాగ్య నిర్మలా తదితరులు పాల్గొన్నారు.

# ఘాట్ రోడ్డు కోసం కాదు గుప్త నిధుల కోసం తవ్వుతున్నట్టుంది..

*** మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి.**





నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నల్లగొండ మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి బ్రహ్మంగారి గుట్ట,లతీఫ్ సాబ్ గుట్టలపై శుక్రవారం జరిపిన పేలుళ్లతో మునుగోడు రోడ్ హౌసింగ్ కాలనిలో ని నివాసాలపై పెద్ద ఎత్తునబండ రాళ్లు పడి తీవ్ర భయభ్రాంతులకు గురైన స్థానిక ప్రజలను వారి నివాసాల వద్ద కలిశారు.ఈ సందర్భంగా స్థానిక ప్రజలు మాట్లాడుతూ, సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా సైరన్ ఇవ్వకుండా జరిపిన బ్లాస్టింగ్ వల్ల.. పెద్ద పెద్ద బండ రాళ్లు తమ నివాస గృహాలపై పడిస్లాబ్ లకు రంధ్రాలు పడి తీవ్ర నష్టం కలిగించాయని, రేకులపై పడి రేకులు పగిలి పోయావని,, ఇంట్లో పనిచేసుకుంటున్న మహిళల దగ్గర రాళ్లుపడి తృటిలో ప్రాణాపాయం నుండి తప్పించు కున్నామని భయంతో రాత్రి ఇళ్ళు విడిచి బంధువుల ఇళ్లలో తలదాచుకున్నామని తమ ఆవేదనను కంచర్ల కు తెలియచేసారు.గతంలో కూడా ఈవిదంగా నే రాళ్లుపడ్డాయని అధికారులకు తెలియ చేసినా ఫలితం లేదనిఘాట్ రోడ్డు 20 మీటర్లు లోతు తవ్వుతున్నారని ఎందుకో అర్ధం కావటం లేదని, గుప్త నిధులకోసం తవ్వు తున్నారేమోనని స్థానికులు అనుమానం వ్యక్తం చేసారు.అధికారులు,కాంట్రాక్టర్ తీరుపై కంచర్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూనిబంధనలకు విరుద్ధంగానివాస గృహాలు ఉన్న ప్రాంతాలలో ఓపెన్ బ్లాస్టింగ్ ఎలా జరుపుతారని, అధికారులు ఎలా అనుమతిస్తారని అదృష్టం బాగుండి ప్రాణాపాయం తప్పిందని ఏమైనా జరుగుతే ఎవరు బాధ్యత వహిస్తారని నీలదీశారు.20 మీటర్లు గుంతలు ఎందుకు తీస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నట్లు గుప్త నిధుల కోసమా అని అనుమాన వ్యక్తం చేసారు.అసలు గుట్టలు పై ఘాట్ రోడ్ నిర్మాణం కొరకు డీపీర్ ఎస్టిమేషన్ లు ఉన్నాయా? ఉంటే టెండర్ ప్రక్రియ చేసారా లేక నామినేషన్ పై ఇచ్చారాఅసలు మంజూరి ఉందా అని అధికారులని ప్రశ్నించారుబ్లాస్టింగ్ లో నష్ట పోయిన కుటుంబలకు నష్ట పరిహారం ఇవ్వాలని కాంట్రాక్టర్ పై వెంటనే కేసు నమోదు చేయాలనీ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షులు బోనగిరి దేవేందర్, కార్పొరేటర్లు మారగోని భవాని గణేష్, పెటిక యాదయ్య, బాణావత్ దీప్ల, కుందూరి దీపిక ప్రవీణ్ రెడ్డి, గోపగోని స్వాతి రాజశేఖర్ జి యడవల్లి సింగిల్ విండో చైర్మన్ దోటి శ్రీనివాస్ మాజీ కౌన్సిలర్ దండంపల్లి సత్తన్న,స్థానిక నాయకులు.. పెటిక కరుణ్ జయరాజ్, మల్లికార్జున్, తదితరులు వెంటఉన్నారు.

# జిల్లా క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎదగాలి

*** మహబూబాద్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి అజయ్ సారధి రెడ్డి.**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : గత నెల రోజులుగా హైదరాబాద్ క్రికెటర్ అసోసియేషన్ హెచ్సీఏ ఆధ్వర్యంలో ఉమ్మడి వరంగల్ డిస్టిక్ క్రికెట్ అసోసియేషన్ డబ్ల్యూ డి సి ఏ సహకారంతో మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న సమ్మర్ క్రికెట్ క్యాంప్ క్రీడాకారులకు శనివారం మహబూబాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంప్ క్రికెట్ టి20 లీగ్ టోర్నమెంట్ ను జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మహబూబాబాద్ క్రికెట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి అజయ్ సారధి రెడ్డి మాట్లాడుతూ గత నెల రోజులుగా మహబూబాద్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న సమ్మర్ క్రికెట్ క్యాంప్ లో క్రీడాకారులకు క్రికెట్ క్రీడా మెలకువలను నేర్పించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారి క్రీడను వెలికి తీసేందుకు నేటి నుండి సమ్మర్ క్యాంప్ క్రికెట్ టి20 లీగ్ టోర్నమెంట్ ను ప్రారంభించడం జరిగింది అన్నారు ఈ సందర్భంగా క్రీడాకారులకు టి20 లీగ్ ద్వారా క్రికెట్ ఆడించడం జరుగుతుందన్నారు సమ్మర్ క్యాంప్ క్రికెట్ టీ20 టోర్నమెంట్ లో జిల్లా క్రీడల అధికారి డిఎస్ఓ జ్యోతి క్రికెట్ అసోసియేషన్ చీఫ్ కోచ్ మెతుకు కుమార్, సహాయ కోచ్ లు తోట వినయ్, సాద్విత్ రెడ్డి క్రీడాకారులు అనిర్వేశ్, పిట్టల శ్రావణ్, పరమేశ్వర్, హేమంత్ రెడ్డి ,చరిత్ రెడ్డి ,నీలం వెంకటేశ్వర్లు, జైనీల్, ధర్మచరన్ రెడ్డి, తరుణ్, మనీష్, అవినాష్, వెలుగు శ్రవణ్ పాల్గొన్నారు.

# రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తెలంగాణ గడ్డమీద బిజెపి జెండా ఎగరవేస్తాం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరిగిన బిజెపి రెండు రోజుల శిక్షణ శిబిరానికి మహబూబాబాద్ బిజెపి జిల్లా అధ్యక్షులు వల్లబు వెంకటేశ్వర్లు అధ్యక్షతన ముగింపు కార్యక్రమానికి మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరై ఈ సందర్భంగా పార్టీ శ్రేణులుకు దిశా నిర్దేశం చేస్తూ ఆయన ప్రసంగించారు. శిక్షణ శిబిరంలో పాల్గొన్న ఈటెల రాజేందర్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ స్థాపించి దీన దయాల్ ఉపాధ్యాయ సారధ్యంలో మొదటిసారి ఎలక్షన్లో రెండు ఎంపీ సీట్లు గెలవడం జరిగింది. కార్యకర్తలు,నాయకులు సమన్వయంతో పనిచేసి క్షేత్ర స్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ప్రజలు మార్పుని కోరుకుంటున్నానని రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై బీజేపీ రాజిలేని పోరాటం చేస్తుందని తెలంగాణ రాష్ట్రంలో బిజెపి కాషాయ జెండా ఎగరవేస్తామని ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ నాయక్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు వల్లభు వెంకటేశ్వర్లు , మాజీ ఎంపీ సీతారాం నాయక్, డాక్టర్ కళ్యాణ్ నాయక్,రవి నాయక్, వద్దిరాజు రామచంద్రరావు,వన్నాల వెంకటరమణ, శ్యాంసుందర్ శర్మ, గడ్డం అశోక్ కుమార్, చీకటి మహేష్ గౌడ్,వార్డు కౌన్సిలర్ శ్రీదేవి, సంపత్, ఇందుభారతి, విజయ, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**: జిల్లా కలెక్టర్ అంకిత్**




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: గోదావరి వరదల నేపథ్యంలో ప్రజల ప్రాణాలు, ఆస్తులకు ఎలాంటి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, తదితర అధికారులతో కలిసి గోదావరి వరదల సన్నద్ధతపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వరదల వల్ల ముంపునకు గురయ్యే గ్రామాలను ముందుగానే గుర్తించి ప్రజలను సురక్షితప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు. భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలు పనిచేసే ఫ్లడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడంతోపాటు మండల, జిల్లా స్థాయిల్లో కూడా కంట్రోల్ రూములు సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. గర్భిణీలు, వద్ధులు, చిన్నారులు, దివ్యాంగులపై ప్రత్యేక దృష్టి సారించాలని, అవసరమైతే ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని సూచించారు. 108 అంబులెన్సులు, అత్యవసర మందులు, పాము కాటు, తేలు కాటు నివారణ వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో పారిశుధ్య చర్యలు, డ్రెయిన్ల శుభ్రత, మంచినీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని చెప్పారు. వాగులు, వంకలు పొంగిపొర్లే సమయంలో ప్రజలు దాటకుండా ప్రమాద హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలని అన్నారు. పశువుల రక్షణకు కూడా తగిన చర్యలు తీసుకోవాలని, పశువైద్య సేవలను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. 73 అడుగుల వరకు గోదావరి వరదలు వచ్చినా ఎదుర్కొనే విధంగా అన్ని శాఖలు కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట మాట్లాడుతూ ముంపు గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించి ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పునరావాస కేంద్రాలు, రెస్క్యూ బృందాలు, అవసరమైన సామగ్రి సిద్ధంగా ఉంచామని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ పనిచేస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గ్రామసభలో సమస్యల పరిష్కారానికి డిపిఓ ఆదేశం

ప్రజాస్ఫూర్తి , జన్నారం : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం రోజున చింతగూడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి డా.వెంకటేశ్వర్ రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సర్పంచ్ సుతారి సుమలత అధ్యక్షతన జరిగిన ఈ సభలో గ్రామస్తులు తమ సమస్యలను అధికారులకు తెలిపారు .గ్రామసభకు వచ్చిన వివిధ శాఖల అధికారులతో ప్రజల సమస్యలపై చర్చించిన డిపిఓ డా.వెంకటేశ్వరావు, వాటిని వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.99 రోజుల ప్రణాళిక లక్ష్యం ప్రజల వద్దకే పాలన తీసుకెళ్లడం అని,ప్రతి సమస్యకు పరిష్కారం చూపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాక్స్ చైర్మన్ నాసాని రాజన్న,ఉప సర్పంచ్ కావ్య,పంచాయతీ కార్యదర్శి రాజన్న, స్పెషల్ ఆఫీసర్ నందన్ వర్మతో పాటు వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భీమలింగం మూసి వంతెనను సందర్శించిన ఎమ్మెల్యే



వలిగొండ, ప్రజాస్ఫూర్తి : భీమలింగేశ్వర స్వామి దేవాలయం నిర్మాణం కోసం ఇప్పటికే 2 కోట్ల రూపాయల నిధులు మంజూరు అయ్యాయని, దేవాలయం నిర్మాణం, సమీపంలో బ్రిడ్జి నిర్మాణం 45 కోట్లు ఆ ప్రాంతం అభివృద్ధి చేసుకోవటానికి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అన్ని విధాలుగా సహకరిస్తా అని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి వెల్లడించారు. భీమలింగేశ్వర స్వామి ఆలయం నిర్మాణం కోసం అధికారులు ప్రణాళికాలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. మూసి ప్రక్షాళన చేసి , ఆలయ నిర్మాణం కూడా పూర్తి చేస్తామని, అన్నారు.ఈ ప్రాంతాన్ని ఆధ్యాత్మిక కేంద్రం గా తీర్చి దిద్దుతామని అంతకు మునుపు స్థానిక నాయకులు ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి కి ఘన స్వాగతం పలికారు. భీమలింగం శివయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టూ ఉన్న ప్రదేశాన్ని పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి, ఇరిగేషన్, రెవెన్యూ, అధికారులు, ఆర్కిటెక్ట్ మరియు విద్యుత్ అధికారులు ఇతర సిబ్బంది,మండల నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఘనంగా మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ జన్మదిన వేడుకలు



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ జిల్లా, బయ్యారం మండలం, కాచనపల్లి గ్రామపంచాయతీ పరిధి కిష్టాపురం గ్రామాల్లో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పర్షిక రాజు మాట్లాడుతూ అందరి అభిమాన నాయకుడు,జనం గుండెలో నిలిచిపోయిన నేత, పేదల పెన్నిధి, అభివృద్ధి ప్రదాత మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ జన్మదిన వేడుకలు చేసుకోవడం చాలా సంతోషంగా ఉందని, తెలంగాణ రాష్ట్ర ప్రజల మదిలో చిరస్థాయిగా నిలిచి ప్రజలతో మమేకమై ప్రజా బాంధవుడుగా ఉండాలని ఆయన ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని అదేవుని ఆశీస్సులు వుండాలని అన్నారు. కాచనపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న గ్రామాల ప్రజలు, గ్రామ పెద్దలు, ఎస్ కే యూసఫ్, బొమ్మల పాండురాజు, వార్డు నెంబర్ చింత శ్రీరామ్, ఇరుప వెంకటేశ్వర్లు ,ఇరుప శేఖర్ ,ఏప నాగరాజ్ ,చింత సాయి ,తాటి గణేష్, కల్తీ సంతోష్, ఇరుప రాంప్రసాద్, యువకులు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు అందుబాటులో ఉండాలి
**: ఎస్పీ రోహిత్ రాజు**



ప్రజా స్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రజలకు పోలీసు సేవలు మరింత చేరువ కావాలని, సైబర్ నేరాలపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. శనివారం టేకులపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆయన, పోలీస్ స్టేషన్ పనితీరు, రికార్డులు, పెండింగ్ కేసుల స్థితిని పరిశీలించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, వివిధ సమస్యలతో వచ్చే బాధితులకు న్యాయం జరిగేలా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అక్రమ ఇసుక రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ స్పష్టం చేశారు. మట్కా, జూదం, కోడి పందాలు, పేకాట, బెట్టింగ్, గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని సూచించారు.సైబర్ నేరాల బారిన ప్రజలు పడకుండా గ్రామాల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, పెట్రోలింగ్ , బ్లూ కోల్ట్స్ వాహనాలతో ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకన్న బాబు, సీఐ సత్యనారాయణ, ఎస్ఐలు రాజేందర్, శ్రీనివాసరెడ్డి, సోమేశ్వర్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : గరిడేపల్లి మండల పరిధిలోని కల్మల చెరువు గ్రామం లో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ కార్యక్రమం నిర్వహించడమైనది ఈ కార్యక్రమంలో చెక్కులు తీసుకున్నటువంటి అమ్మనబోయిన వరుణ్ తేజ్ సన్నాఫ్ నాగయ్య చల్ల అక్కమ్మ బొల్లగాని తిరపయ్య అమ్మనబోయిన రాములు సామిలేటి మనీ మూలగుండ్ల ప్రమీల వైఫ్ ఆఫ్ రవీందర్ రెడ్డి మీసాల దుర్గమ్మ వీరికి కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కుల్ని అందజేశారు ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షులు మీసాల యవాన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆరేకృష్ణారెడ్డి మాజీ ఎంపిటిసి మూలగుండ్ల సైదిరెడ్డి ఎక్స్ ఎం పి టి సి గుండ్ల సత్యనారాయణ రెడ్డి మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఆది రెడ్డి ఉప సర్పంచ్ కందుకూరి కృష్ణారెడ్డి బొల్లగాని పెద్ద సైదులు బొల్లగాని నాగేష్ మాజీ వార్డ్ నెంబర్ నట్టే నరసింహారావు గట్టిగొప్పుల రామిరెడ్డి అమరవరపు ప్రేమ్ కుమార్ అమలవరపు నాగేష్ అమరవరపు రాములు గుండ్ల అనిల్ బోళ్ల సత్యనారాయణ రెడ్డి తదితరులు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా జిల్లా కలెక్టర్ తనిఖీ



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : కలెక్టర్ బి, చంద్రశేఖర్ పట్టణంలోని ప్రధాని ఆసుపత్రిని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఆసుపత్రిలోని పలు విభాగాలను సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవల గురించి కలెక్టర్ ఆరా తీశారు.మొదట సూపరింటీండెంట్ కార్యాలయంలో హాజరు రిజిస్టర్లను పరిశీలించిన కలెక్టర్, అనంతరం వెల్‌నెస్ సెంటర్‌ను సందర్శించారు. అక్కడ చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వైద్యం సక్రమంగా అందుతోందా? అవసరమైన మందులు అందిస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. కొన్ని మందులు అందుబాటులో లేవని రోగులు చెప్పడంతో వెంటనే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వాటి సరఫరా పరిస్థితిని తెలుసుకుని, అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఆసుపత్రిలో త్వరలో ప్రారంభించనున్న డిఅడిక్షన్ సెంటర్‌ను కూడా పరిశీలించిన కలెక్టర్, మాదకద్రవ్యాల వ్యసనానికి గురైన వారికి ప్రత్యేక కౌన్సిలింగ్ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. రోగుల అవసరాలకు అనుగుణంగా విభాగాలను వేర్వేరుగా ఏర్పాటు చేసి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.అనంతరం ఎంసీహెచ్ (మాతా శిశు ఆరోగ్య) వార్డును సందర్శించిన కలెక్టర్, గర్భిణీ స్త్రీలతో మాట్లాడి వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది తమను బాగా చూసుకుంటున్నారని వారు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలను వారి గర్భిణీ స్త్రీలను తీసుకువచ్చారు స్వస్థలాల గురించి అడిగి తెలుసుకున్నారు. మునుగోడు ప్రాంతం నుంచి వచ్చామని వారు చెప్పగా, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు.ఫార్మసీ విభాగాన్ని కూడా పరిశీలించిన కలెక్టర్, మందుల నిల్వలు, పంపిణీ విధానంపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రిసూపరింటెండెంట్‌తో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన వైద్యం అందేలా చూడాలని, విధుల్లో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వవద్దని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ఆసుపత్రుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు.ఆసుపత్రి సూపరింటిండెంట్ నేత నరసింహారావు, డాక్టర్ శ్రీకాంత్,డాక్టర్లు,తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## కూసుమంచి మండలంలో ...
# బాధిత కుటుంబాలు, అనారోగ్య బాధితులకు పరామర్శ

కూసుమంచి, ప్రజా స్ఫూర్తి: ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడమే ప్రజాప్రతినిధుల అసలైన బాధ్యత అని మరోసారి చాటిచెప్పుతూ పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి కూసుమంచి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి బాధిత కుటుంబాలను, అనారోగ్యంతో బాధపడుతున్న వారిని పరామర్శించారు. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడి సమస్యలను తెలుసుకుని మానసిక ధైర్యాన్ని నింపారు. మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన లోడిగా రాములమ్మ, గాంతి లచ్చిరెడ్డి కుటుంబాలను, అలాగే చౌటుపల్లి-చేగొమ్మ గ్రామాలకు చెందిన సట్టు కోటమ్మ, మరికంటి వెంకటనారాయణ కుటుంబాలను వారి నివాసాల్లో కలిసి పరామర్శించారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకుంటూ, ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలు ధైర్యంగా ఉండాలని, కష్టకాలాన్ని అధిగమించేలా మానసిక స్థైర్యంతో




ముందుకు సాగాలని సూచించారు.

* **అనారోగ్య బాధితులకు పరామర్శ.. వైద్య సహకారానికి హామీ**

అనంతరం కూసుమంచి గ్రామానికి చెందిన కొక్కిరేణి వీరస్వామి మరియు మందనాగుల అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకుని వారి నివాసాలకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పొందుతున్న వైద్యం, ఆరోగ్య స్థితిగతులపై కుటుంబ సభ్యులతో చర్చించారు. అవసరమైతే మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం కుసుమంచి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కనకం మైసయ్యతో కాసేపు ముచ్చటించి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజలు సంతోషంగా ఉన్నప్పుడు మాత్రమే కాకుండా కష్టాల్లో ఉన్నప్పుడు కూడా వారితో ఉండటం తన బాధ్యతగా భావిస్తానన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. ప్రజల ప్రేమాభిమానాలే తనకు బలమని, వారి సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల మాజీ ప్రజాప్రతినిధులు,సర్పంచులు, ఉపసర్పంచులు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే పర్యటనతో బాధిత కుటుంబాలకు ధైర్యం, భరోసా లభించిందని గ్రామస్తులు అభిప్రాయపడ్డారు.

# ప్రణాళికాబద్ధంగా కార్పొరేషన్ అభివృద్ధి

**– కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



ప్రజా స్ఫూర్తి, కొత్తగూడెం: ప్రణాళికాబద్ధంగా కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌ను అభివృద్ధి చేసుకోవాలని, ప్రతి డివిజన్‌లోనూ ప్రజల అవసరాలను గుర్తించి ముందుకు సాగాలని సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ కౌన్సిల్ సమావేశం మేయర్ మూడ్ గణేష్ అధ్యక్షతన శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో జరిగింది. ఈ సమావేశానికి కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిధిగా హాజరై మాట్లాడారు. నగర పరిధిలో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. ప్రధానంగా ఎండకాలం దృష్ట్యా తాగునీటి సమస్య పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని, నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య తీవ్రంగా ఉన్నచోట ట్యాంకర్ల ద్వారా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. ఎలాంటి సమస్యలు లేని ఆదర్శ కార్పొరేషన్‌గా కొత్తగూడెం కార్పొరేషన్‌ను తీర్చిదిద్దేందుకు అందరం కలిసికట్టుగా శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి, కార్పొరేషన్ అభివృద్ధికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి వున్నానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

# పెరిగిన ఇంధన ధరలకు నిరసనగా జూన్ 10న కలెక్టరేట్ ఎదుట ధర్నా

* **విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం.**




నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : దేశంలో ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల అనంతరం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌తో పాటు వంట గ్యాస్ ధరలను విడతల వారీగా పెంచుతూ సామాన్య ప్రజలపై మోయలేని భారం మోపిందని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం తీవ్రంగా ధ్వజమెత్తారు. పెంచిన ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ జూన్ 10వ తేదీన కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు ఆయన ప్రకటించారు.
శనివారం నల్లగొండ జిల్లా సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలోఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై నిప్పులు చెరిగారు.ఎన్నికలు ముగియగానే ఇంధన ధరలు పెంచి ప్రజలను దోచుకుంటున్నారని మండిపడ్డారు. జూన్ 10న చేపట్టే కలెక్టరేట్ ధర్నాలో ప్రజలు, రైతులు, కార్మికులు, మహిళలు, యువత, పార్టీ శ్రేణులు వేలాదిగా తరలిరావాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై గళం వినిపించాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి,మాజీ ఎమ్మెల్యే ఉజ్జినియాదగిరిరావు,సీనియర్ నాయకులు మల్లెపల్లి ఆదిరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులు పల్లా దేవేందర్ రెడ్డి,లోడంగి శ్రవణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, టి.వెంకటేశ్వర్లు,తూము బుచ్చిరెడ్డి, పట్టణ కార్యదర్శి కర్ర సైదిరెడ్డితదితరులు పాల్గొన్నారు

# నల్గొండ జిల్లా డీఎస్పీని కలిసిన యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ లీగల్ అవేర్నెస్ ప్రతినిధులు



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నల్గొండ యూనివర్సల్ హ్యూమన్ రైట్స్ లీగల్ అవేర్నెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్గొండ డిఎస్పి కే శివరాం రెడ్డి ని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి మహిళల హక్కులు చట్టపరమైన అవగాహన మహిళ సాధికారత భద్రత , సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.ఈ సందర్భంగా మహిళలకు చట్టపరమైన అవగాహన కల్పించడం మహిళలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్ట ఎందుకు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వ సంస్థలు , స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని అభిప్రాయపడ్డారు. సమావేశంలో యు హెచ్ ఆర్ ఎల్ ఏ ఏ చైర్మన్ డి కమలాకర్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు జి లలిత, హైదరాబాద్ డిస్టిక్ ప్రెసిడెంట్ రాజు రెడ్డి, నల్గొండ జిల్లా అధ్యక్షురాలు సృజన, వైస్ ప్రెసిడెంట్ స్రవంతి. నల్గొండ జిల్లా సెక్రెటరీ జె బిందు సెక్రటరీ జనరల్ సెక్రటరీ సునీత తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా నల్గొండ డీఎస్పీ శివరాం రెడ్డి మానవహక్కులు మహిళా హక్కులు మరియు చట్టపరమైన అవగాహన కార్యక్రమాలను అభినందిస్తూ మహిళా సాధికారత కోసం సంస్థ మరింత సేవలు చేయాలని ఆకాంక్షించారు. ఈ సమావేశం సానుకూల వాతావరణంలో జరిగే మహిళా అభ్యున్నతికి మరియు సామాజిక న్యాయం కోసం భవిష్యత్తులో పరస్పర సహకారంతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు.

# దినేష్ కుమార్ ను అభినందించిన కెఎస్ఆర్

కుత్బుల్లాపూర్, ప్రజాస్ఫూర్తి : హైదరాబాదులోని గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సంబంధిత ప్రతినిధుల ఆధ్వర్యంలో 2026 ఫిబ్రవరి 2వ తేదిన జరిగిన కార్యక్రమంలో 22 దేశాల నుండి 2000 మంది కీబోర్డ్ వాయిద్య కారులు పాల్గొన్నారు. ఈ పోటీలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి అభిమాని కవి దినేష్ కుమార్ పాల్గొన్నారు. గంటపాటు 2000 మంది ఆపకుండా కీబోర్డ్ వాయించి ప్రతిభను గుర్తించిన అధికారులు 777 మంది వాయిద్య కారులను ఎంపిక చేశారు. వారిలో దినేష్ కుమార్ కూడా ఎంపికయ్యారు. శనివారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి కె ఎస్ ఆర్ ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా కొలను శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఇది మనకు ఎంతో గర్వకారణం ఇంకా ముందు ముందు ఇలాంటి రికార్డులను సాధించాలి ఎంతో ఎత్తుకి ఎదగాలి దానికి పూర్తిస్థాయిలో నా తోడు ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపి అభినందించారు.

# అనుమానాస్పద కదలికలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి

* **గరిడేపల్లి ఎస్ఐ బి. శ్రీకాంత్ గౌడ్**




గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి : రాత్రి వేళల్లో అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా అనుమానాస్పద కదలికలు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గరిడేపల్లి ఎస్ఐ బి. శ్రీకాంత్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అప్రమత్తతతోనే నేరాలను అరికట్టడం సాధ్యమన్నారు. గరిడేపల్లి పోలీసులు గ్రామాల్లో నిరంతర పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి గ్రామంలో రాత్రి వేళల్లో ప్రత్యేక రౌండ్లు నిర్వహిస్తూ ప్రజల భద్రత కోసం అప్రమత్తంగా పనిచేస్తున్నారన్నారు. "ప్రజల సహకారం పోలీసులకు బలాన్నిస్తుందని, నేరాలను అరికట్టడంలో ప్రతి పౌరుడి బాధ్యత ఎంతో ముఖ్యమైనదన్నారు. ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా భయపడకుండా వెంటనే 100కు డయల్ చేయాలన్నారు. మీ భద్రత కోసం గరిడేపల్లి పోలీసులు 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు. అత్యవసర సహాయం కోసం : 100, ప్రజల సేవలో గరిడేపల్లి పోలీసులు, గ్రామాల్లో నిరంతర పెట్రోలింగ్... ప్రజల భద్రతే మా ప్రాధాన్యత అన్నారు. సురక్షిత సమాజ నిర్మాణమే మా ధ్యేయం అని గరిడేపల్లి ఎస్ఐ బి. శ్రీకాంత్ గౌడ్ తెలియజేశారు.

# పట్టణంలో భారీ వాహనాలపై ఆంక్షలు

* **ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి:**
* **ట్రాఫిక్ సీఐ మహాలక్ష్మయ్య ..**



నలగొండ, ప్రజాస్ఫూర్తి : నల్లగొండ పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ,పాఠశాలల ప్రారంభం దృష్ట్యా రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు భారీ వాహనాలు, లారీలు, ట్రాక్టర్లు,రాకపోకలపై ప్రత్యేక ఆంక్షలు అమలు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ తెలిపారు. ప్రజల భద్రత దృష్ట్యా ట్రాఫిక్ నియమాలను ప్రతి వాహనదారుడు కచ్చితంగా పాటించాలని ట్రాఫిక్ సిఐ మహా లక్ష్మయ్య ఒక ప్రకటనలో సూచించారు.పట్టణంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు భారీ వాహనాల ప్రవేశాన్ని నియంత్రిస్తూ ఉదయం 8 గంటల నుండి రాత్రి 10.00 గంటల వరకు భారీ వాహనాలకు పట్టణ పరిధిలో అనుమతి ఉండదని స్పష్టం చేశారు. నిర్ణీత సమయాలకు విరుద్ధంగా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.అలాగే వాహనాలు నడిపేటప్పుడు లైన్ డిసిప్లిన్ పాటిస్తూ, ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలపరాదని తెలిపారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగంగా డ్రైవింగ్ చేయడం, అనధికారిక పార్కింగ్ వంటి ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామని చెప్పారు. అవసరమైతే డ్రైవింగ్ లైసెన్సుల రద్దు, వాహనాల సీజ్ వంటి కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.మీ నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్ల ఇతరుల ప్రాణాలు ప్రమాదంలో పడకుండా ప్రతి డ్రైవర్ బాధ్యతగా వ్యవహరించాలి. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత" అని పేర్కొన్నారు.ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని ట్రాఫిక్ పోలీసులు ప్రజలను కోరారు.

# చౌటుప్పల్ లో ఆర్టీసీ బస్ డిపోను ఏర్పాటు చేయాలి

**: ఎండి పాషా**




చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ లో ఆర్టీసీ బస్ డిపోను ఏర్పాటు చేయాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఎండి పాషా డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం కందాల రంగారెడ్డి స్మారక భవన్ లో శనివారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చౌటుప్పల్ పట్టణం, చుట్టుపక్క మండల ప్రాంతాల ప్రజల రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకొని మూడు దశాబ్దాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో చౌటుప్పల్ బస్ డిపో ఏర్పాటు కోసం స్థలం కేటాయించడం జరిగిందని గుర్తు చేశారు. కానీ, నామమాత్రంగా బస్టాండ్ ను నిర్మించారని, సంవత్సరాలు గడుస్తున్న బస్ డిపో మాత్రం అందని ద్రాక్షగా మారిందన్నారు. ప్రభుత్వం లీజుల పేరు మీద, పెట్రోల్ బంక్ పేరు మీద, కోట్ల విలువైనటు వంటి స్థలం కబ్జాకు గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. చౌటుప్పల్ లో బస్సు డిపో లేకపోవడం వల్ల ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బస్ డిపో ఏర్పాటు చేస్తే స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందడంతో పాటు, కొత్త బస్సుల నిర్వహణ, సర్వీసుల ఏర్పాటుతో పాటు నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాల కల్పనకు కూడా దోహదపడుతాయన్నారు. ఈ సమావేశంలో సిపిఎం పార్టీ మున్సిపల్ కార్యదర్శి గోశిక కరుణాకర్, కార్యదర్శివర్గ సభ్యులు బత్తుల దాసు, ఆకుల ధర్మయ్య, గోపగోని లక్ష్మణ్, నాయకులు ఆదిమూలం నందీశ్వర్, తొర్పునూరి మల్లేశం, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, బోయ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎంల గోదామును తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : కలెక్టరేట్ దగ్గరలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషిన్లు (ఈవీఎంలు), వివిప్యాట్ లు భద్రపరిచిన గోదామును జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ శనివారం గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తనిఖీ చేశారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలలో భాగంగా ఈ పరిశీలన చేపట్టారు. గోదాములో పటిష్ట భద్రత నడుమ భద్రపరిచిన ఈవీఎంలు, వివిప్యాట్ లు, బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, ఎన్నికల సామగ్రి నిల్వ ఉంచిన గదులను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. భద్రతా చర్యల్లో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, గోదాం భద్రతా వ్యవస్థలను సమీక్షించారు. ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. నిర్వహణకు సంబంధించిన రిజిస్టర్లను పరిశీలించి సంతకాలు చేశారు. ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ పవన్ కుమార్, గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఆడపిల్లల భద్రతే దేశాభివృద్ధికి బాట

* **సోషల్ మీడియాలో అపరిచితులతో జాగ్రత్త**




జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ప్రజాస్ఫూర్తి : మహిళలు, బాలికల భద్రతపై మరింత అవగాహన కల్పించేందుకు జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో షీ టీం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని ఐటీ మాస్టర్ ఇన్స్టిట్యూట్ తో పాటు భూపాలపల్లి బస్టాండ్ లో శనివారం అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా షీటీం సిబ్బంది విద్యార్థినులు, మహిళలకు పలు సూచనలు చేశారు. సోషల్ మీడియా ద్వారా తెలియని వ్యక్తులతో పరిచయాలు పెంచుకోవద్దని, అపరిచితులకు వ్యక్తిగత వివరాలు వెల్లడించవద్దని హెచ్చరించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగిస్తేనే భవిష్యత్తు సురక్షితంగా ఉంటుందని వివరించారు. మహిళలు, బాలికలు వేధింపులు ఎదురైనప్పుడు భయపడకుండా ధైర్యంగా ఫిర్యాదు చేయాలని, ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు. మహిళల రక్షణ, భద్రతే షీ టీం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ప్రయాణాల సమయంలో టీసేఫ్ యాప్ వినియోగించడం ద్వారా అదనపు భద్రత పొందవచ్చని సూచించారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత సమాచారం పంచుకోవడం, అనుమానాస్పద లింకులను క్లిక్ చేయడం వల్ల సైబర్ నేరాల బారిన పడే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఆడపిల్లలకు ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే షీటీం హెల్ప్‌లైన్ 8712658162ను సంప్రదించాలని, సైబర్ మోసాలకు గురైతే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గుడ్ టచ్-బ్యాడ్ టచ్, పోక్సో చట్టం, మహిళలు, బాలల రక్షణకు సంబంధించిన నిబంధనలపై అవగాహన కల్పించారు. నిజ జీవిత సంఘటనలను ఉదాహరణలుగా వివరిస్తూ విద్యార్థులు, విద్యార్థినులు తమ హక్కులు, భద్రతపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళల భద్రతకు సమాజం మొత్తం బాధ్యత వహించాలని, ఆడపిల్లలను రక్షించడం ద్వారా దేశాభివృద్ధికి తోడ్పడవచ్చని షీ టీం సిబ్బంది పేర్కొన్నారు.

# మూడు నెలల్లో సమస్యలు క్లియర్

* **మత్తు పదార్థాలపై అప్రమత్తంగా ఉండాలి**
* **చౌటుప్పల్ చైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్**





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ పరిధిలోని ప్రధాన సమస్యలు మూడు నెలల్లో పరిష్కరిస్తానని చౌటుప్పల్ చైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్ అన్నారు. చౌటుప్ప మున్సిపాలిటీ పరిధిలోని 8, 9, 10, 11, 19వార్డులలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక వార్డు సభలు శనివారం నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్, కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ ల ఆధ్వర్యంలో జరిగిన సభల్లో స్థానిక సమస్యలపై ప్రజలు అధికారులకు వినతులు సమర్పించారు. లక్కారం చెరువు కట్ట, రహదారులు, డ్రైనేజీలు, జంగాల కాలనీలో ఇందిరమ్మ ఇళ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణం, పెన్షన్లు, పార్కులు, వాకింగ్ ట్రాక్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ తదితర అంశాలపై చర్చించారు. లక్కారంలో కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ప్రారంభించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐదు వార్డుల్లో మొక్కలు నాటారు. గంజాయి, మత్తు పదార్థాలపై యువత, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని పోలీసు, మహిళా సాధికారిత శాఖ అధికారులు సూచించారు. కోతులు, వీధి కుక్కల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. వార్డుల్లో ప్రజలు లేవనెత్తిన ప్రధాన సమస్యలను మూడు నెలల్లో పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాలని, సంరక్షణ అసలు కూడా చేపట్టాలన్నారు. అదేవిధంగా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే రూ.500నుంచి రూ.5వేల వరకు జరిమానాతో పాటు కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చౌటుప్పల్ సిఐ మన్మధకుమార్, చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, చౌటుప్పల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్, కౌన్సిలర్లు బద్రి గాలయ్య, దేప రమ్య రాజు, పిల్లలమర్రి మధుసూదన్, జిల్లా మత్స్యశాఖ అధ్యక్షుడు పాశం సంజయ్ బాబు, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది దంపతులను సన్మానించిన బెలిదె శ్రీనివాసులు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట : పర్యావరణ పరిరక్షణలో సూర్యాపేట మున్సిపాలిటీ కి రాష్ట్రస్థాయిలో ప్రథమ అవార్డు లభించిన సందర్భంగా శనివారం హైదరాబాదులో రాష్ట్ర దేవాదాయ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ చేతుల మీదుగా ఉత్తమ మున్సిపాలిటీ పర్యావరణ పరిరక్షణ అవార్డును మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది స్వీకరించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది దంపతులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ మున్సిపల్ పారిశుద్య కార్మికులు నిరంతరం పనిచేయడం వల్లనే ఈ అవార్డు లభించిందని అన్నారు. పట్టణంలో జరుగుతున్న పారిశుద్య పనులను తాను ప్రతిరోజూ పర్యవేక్షణ చేస్తున్నానని అన్నారు. సూర్యాపేట మున్సిపాలిటీ ని అన్ని రంగాలలో రాష్ట్రం లో ఉత్తమ మున్సిపాలిటీలిగా తీర్చిదిద్దుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉప్పల సత్యనారాయణ, బిక్కుమళ్ల కృష్ణ, రాచకొండ శ్రీనివాస్, మిట్టపల్లి రమేష్, బెలిదె అంజయ్య, సుమన్ వెంకన్న, కందిబండ ఉమామేశ్వర రావు, సోమ ప్రవీణ్, భోనగిరి కృష్ణ, దోగుపర్తి ప్రవీణ్, కుంచపర్తి బాలకృష్ణ, రాచర్ల సత్యం, బెలిదె శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవాలి



ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: పోచారం లోని డిబిసిలో నిర్వహించబడే బర్డ్ వాక్‌లో డీఎఫ్ఓ జోజి ఆధ్వర్యంలో అటవీశాఖ సిబ్బందితో చేపట్టిన ఈ కార్యక్రమంలో మెదక్ డిపిఆర్ఓ రామచంద్ర రాజు, తో కలిసి అదనపు కలెక్టర్ నగేష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్, డీఎఫ్ఓ జోజి పోచారంలోని డిబిసిలో నాలుగు కిలోమీటర్ల బర్డ్ వాక్ లో పాల్గొన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అటవీ వారోత్సవాలను విజయవంతంగా నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా బర్డ్ వాక్ నిర్వహించడం జరిగిందన్నారు. పోచారం ల్యాండ్‌స్కేప్ యొక్క గొప్ప పక్షి వైవిధ్యం, సహజ వారసత్వం పట్ల ప్రశంసను ప్రోత్సహించడానికి, బర్డ్ వాక్ నిర్వహించామన్నారు. పోచారం జలాశయం, అభయారణ్యం చుట్టూ ఉన్న పోచారం ప్రాంతం, వలస నీటి పక్షులు, కొంగలు, ఐబిస్‌లు, బాతులు అనేక అటవీ ప్రాంతాలతో సహా విభిన్న పక్షి జీవనానికి ప్రసిద్ధి చెందిందన్నారు. ఇది ఒక ముఖ్యమైన పక్షి వీక్షణ గమ్యస్థానంగా నిలుస్తుందనీ ప్రకృతి ప్రేమికులు, విద్యార్థులు, అధికారులు పాల్గొని వివిధ రకాల పక్షులను వీక్షించాలని, పక్షుల జీవన విధానం, వలస పక్షుల ప్రాముఖ్యత, పర్యావరణ సమతుల్యతలో వాటి పాత్ర గురించి, పక్షుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా చెట్లు నాటడం, నీటి వనరులను కాపాడడం, పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచడం అవసరం అన్నారు. ప్రకృతిని దగ్గరగా ఆస్వాదిస్తూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించుకోవడానికి బర్డ్ వాక్ వంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ ఆర్ ఓ లు బీట్ ఆఫీసర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్టీఆర్ విగ్రహానికి నిప్పు పెట్టిన దుండగులు

* **పాక్షికంగా విగ్రహం ధ్వంసం, శుద్ధి చేసి పాలాభిషేకం చేసిన టిడిపి.**
* **దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలి కసిరెడ్డి.**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నల్లగొండ జిల్లా కేంద్రంలో హైదరాబాద్ రోడ్డులో గల తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహానికి గత రాత్రి కొంతమంది దుండగులు పెట్రోల్ పోసి నిప్పంటించడంతో విగ్రహం పాక్షికంగా ధ్వంసం అయింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగి మంటలను ఆర్పేయడంతో విగ్రహం పూర్తిగా కాలిపోకుండా కాపాడారు, దుండగులు ఎన్టీఆర్ విగ్రహానికి నిప్పు పెట్టిన విషయం తెలుసుకున్న .నల్గొండ పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ కన్వీనర్ కసిరెడ్డి శేఖర్ రెడ్డి ఎల్వి . యాదవ్ విగ్రహానికి పాలాభిషేకం చేసి విగ్రహాన్ని శుద్ధి చేసి పూలమాలతో అలంకరించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇట్టి సంఘటన చాలా విచారకరం, బడుగు బలహీన వర్గాలకు రాజకీయ అవకాశాలు కల్పించి వారి అభివృద్ధి కోసం కృషి చేసిన దేవుడు లాంటి మనిషి, అవినీతి మచ్చ లేని నాయకుడు, భారతదేశం లోనే మొట్ట మొదటి సారిగా సంక్షేమ పతకాలు కూడు, గూడు, గుడ్డ , వితంతు, వృద్యాప్య పించన్లు ప్రవేశ పెట్టినటువంటి నాయకుడి విగ్రహానికి నిప్పు పెట్టిన సంఘటన సిగ్గు మాలిన చర్య, కొంతమంది కుహనా వాదులు తెలుగుదేశం పార్టీ తెలంగాణ లో అడుగు పెడితే మమ్మల్ని అధికారం లోకి రానివ్వరు అన్న ఉద్దేశ్యం తో కుటిల ప్రయత్నం తో ఇటువంటి సంఘటనకు పాల్పడిన వారి పైన వెంటనే విచారణ చేపట్టి ఇలాంటి సంఘ విద్రోహ శక్తులను 24 గంటల్లో తమరు పట్టుకొని, ఇలాంటి చర్యలకు పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలని నల్గొండ తెలుగుదేశం పార్లమెంట్ పార్టీ పక్షాన నల్గొండ ఎస్పీకి మెమో రాండం ఇచ్చారు. లేని పక్షం లో భవిష్యత్తులో జాతీయ, రాష్ట్ర, పార్లమెంట్ పార్టీ కార్యాచరణ చేపడుతుంది. దీని వెనుకాల ఎంత పెద్దమనుషులు ఉన్న వెంటనే అరెస్ట్ చేయాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కూరెళ్ల విజయ్ కుమార్, గుండు వెంకటేశ్వర్లు, ఎం కె ఐ సిద్ధిక్, కాంచనపల్లి క్రాంతికుమార్, వనమా మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలని అవగాహన



చిట్యాల, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, బడి ఈడు పిల్లలందరికీ విద్య అందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న 'ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట' కార్యక్రమం చిట్యాల మండలం, నైన్‌పాక గ్రామంలో శనివారం నిర్వహించారు. గ్రామంలోని ఉపాధి హామీ కూలీలు పనిచేస్తున్న ప్రదేశానికి వెళ్లి తల్లిదండ్రులకు విద్య ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. గ్రామ సర్పంచ్ నక్క భాస్కర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఆర్. ఊర్మిళ, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి. తిరుపతయ్య పాల్గొని మాట్లాడారు. గ్రామంలోని బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. విద్యార్థుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు 21 రకాల వస్తువులతో కూడిన ఉచిత కిట్తో పాటు అల్పాహార (బ్రేక్‌ఫాస్ట్) పథకం కూడా అమలు చేస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన, సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, తల్లిదండ్రులు పాఠశాలలను సందర్శించి వాటి పనితీరును పరిశీలించాలని సూచించారు. పిల్లల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు అంకితభావంతో కృషి చేస్తున్నారని, ప్రభుత్వ విద్యను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గడ్డి రాములు, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు కే. ప్రవీణ్‌కుమార్, ప్రసాద్, సీఆర్పీ తిరుపతి, యువజన సంఘాల నాయకులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రైతులకు ప్రభుత్వం పెద్దపీట

* **జెండా ఊపి బస్సులు ప్రారంభం**
* **చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: తెలంగాణ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తుందని చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య అన్నారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మెట్ మండలం కోహెడ గ్రామంలో అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ కు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన కార్యక్రమానికి చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రం నుంచి బయలుదేరుతున్న రైతుల బస్సులను శనివారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో పండ్ల మార్కెట్ ఏర్పాటు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వానికి నిబద్ధతకు నిదర్శనమన్నారు. పండ్ల రైతుల భవిష్యత్తుకు భరోసాను కల్పిస్తూ ప్రభుత్వం అంతర్జాతీయ స్థాయిలో పండ్ల మార్కెట్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ చెన్నగోని అంజయ్య గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బోయ దేవేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బోయ వెంకటేశం, కరెంటోతు శంకర్ నాయక్, ఢిల్లీ చంద్రకళ, చప్పిడి సంజీవరెడ్డి, కాటేపల్లి నవీన్ గౌడ్, మహమ్మద్ గౌస్ ఖాన్, చిమ్ముల వెంకట్ రెడ్డి, పబ్బు శ్రీకాంత్, మర్రి రాజిరెడ్డి, సుర్వి వెంకటేష్ గౌడ్, దాచేపల్లి విజయ్, గజ్జెల కృష్ణమూర్తి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సినిమా



మృణాల్ ఠాకూర్ తన అద్భుతమైన నటన, సహజ సౌందర్యం మరియు హావభావాలతో ప్రేక్షకులను అలరిస్తున్న ప్రముఖ భారతీయ నటి. టెలివిజన్ రంగం నుండి సినీ పరిశ్రమలోకి ప్రవేశించి, తన ప్రతిభతో దక్షిణాది మరియు హిందీ చిత్రాల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నారు. ముఖ్యంగా 'సీతారామం' వంటి చిత్రాలతో ఆమె నటనకు ఎంతో ప్రశంసలు దక్కాయి.



## డెడ్‌లిఫ్ట్‌తో.. గాయపడ్డ రకుల్

ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్ తాను గతంలో ఎదుర్కొన్న తీవ్రమైన ఆరోగ్య సమస్య గురించి తాజాగా స్పందించారు. జిమ్‌లో శిక్షణ పొందుతున్న సమయంలో 80 కిలోల డెడ్‌లిఫ్ట్‌ను ఎటువంటి సేఫ్టీ బెల్ట్ లేకుండా ప్రయత్నించడం వల్ల స్లిప్ డిస్క్ బారినపడ్డానని, ఆ గాయం కారణంగా సుమారు 40 రోజుల పాటు మంచానికే పరిమితం కావాల్సి వచ్చిందని ఆమె తెలిపారు. నేహా ధూపియా, అంగద్ బేడీలు నిర్వహిస్తున్న 'డబుల్ డేట్' టాక్ షోలో తన భర్త జాకీ భగ్నానీతో కలిసి పాల్గొన్న రకుల్, ఆనాటి చేదు అనుభవాన్ని గుర్తు చేసుకున్నారు. "మీ ట్రైనర్‌లు ఏం చెప్పినా సరే, డెడ్‌లిఫ్ట్ చేయడం అనేది అత్యంత ప్రమాదకరమైన వ్యాయామం. అది కేవలం ఒక ఇగో లిఫ్ట్ మాత్రమే. ఆనాడు నేను చేసిన చిన్న పొరపాటు స్లిప్ డిస్క్‌కు దారితీసింది" అని ఆమె పేర్కొన్నారు. ఆ గాయం కారణంగా కనీసం కదలలేని స్థితికి చేరుకున్నానని, నరాల సంబంధిత సమస్యలు కూడా తలెత్తాయని ఆమె వివరించారు. ఎంతో చురుకుగా ఉండే తాను, రోజువారీ పనుల కోసం కూడా ఇతరులపై ఆధారపడాల్సి రావడం తనను మానసిక వేదనకు గురిచేసిందని రకుల్ తెలిపారు. "ఇది కేవలం శారీరక గాయమే కాదు, నన్ను మానసికంగానూ ఎంతో కృంగదీసింది" అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, ఆ క్లిష్ట పరిస్థితుల్లో తన భర్త జాకీ భగ్నానీ తనకు అండగా నిలిచి ఎంతో ధైర్యాన్ని అందించారని ఆమె పేర్కొన్నారు. 2024 ఫిబ్రవరిలో గోవా వేదికగా వివాహం చేసుకున్న ఈ జంట, తమ వైవాహిక బంధానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను ఈ షోలో పంచుకున్నారు.

## బెదిరింపులు వద్దు.. ప్రశ్నించడం మా హక్కు

: ప్రకాశ్ రాజ్ పోస్ట్




సోషల్ మీడియాలో ఎప్పుడూ చురుగ్గా ఉంటారు ప్రకాశ్ రాజ్. సామాజిక, రాజకీయ అంశాలపై తన అభిప్రాయాలను నిర్మొహమాటంగా వెల్లడిస్తుంటారు. తాజాగా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ నాగబాబు పెట్టిన పోస్ట్‌పై ప్రకాశ్ రాజ్ స్పందించారు. నాయకుడికి అన్నీ తెలుసని ఆయన మాటే శాసనం అని నాగబాబు పోస్ట్ పెట్టారు. నాయకుడి మాటను అనుసరించాలని కోరారు. ఎలాంటి సందేహాలు పెట్టుకోవద్దని విజ్ఞప్తి చేస్తూ పవన్ ఫొటోను పంచుకున్నారు. ఈ పోస్ట్‌కు ప్రకాశ్ రాజ్ స్పందించారు. "మీ సందేహాలను పక్కనపెట్టండి. మౌనంగా నాయకుడిని అనుసరించండి అనడంలో మీ ఉద్దేశం ఏంటి. మేం జంతువులం కాదు మౌనంగా బతకడానికి. ఈ బెదిరింపులు వద్దు నాగబాబు గారు. ప్రశ్నించడం మా హక్కు. ఏ నాయకుడైనా, నేనే నాయకుడిని అనుకున్నవాడైనా, సమాధానం ఇవ్వాల్సిన బాధ్యత ఉంటుంది" అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు.




## జేడీ చక్రవర్తితో గొడవపై రంభ ఆసక్తికర వ్యాఖ్యలు!

ఒకప్పుడు టాలీవుడ్‌ను తన గ్లామర్, నటనతో ఊపేసిన సీనియర్ నటి రంభ... తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన కోస్టార్, నటుడు జేడీ చక్రవర్తితో తనకున్న అనుబంధం గురించి పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకుంది. 'బొంబాయి ప్రియుడు' సినిమా షూటింగ్ సమయంలో జేడీ చక్రవర్తితో తనకు మంచి స్నేహం ఏర్పడిందని రంభ చెప్పింది. జేడీ ఎప్పుడూ చాలా సరదాగా ఉంటారని, అందరినీ ఎంటర్‌టైన్ చేస్తారని, ఆయనతో గడిపిన సమయం ఎంతో సంతోషాన్ని ఇస్తుందని కొనియాడింది. అయితే, అంతటి ఆత్మీయ స్నేహితుడైన జేడీ చక్రవర్తి... తన పెళ్లికి రాకపోవడం తనను తీవ్రంగా బాధించిందని రంభ ఈ సందర్భంగా వెల్లడించింది. "ఆయన నాకు అంత క్లోజ్ ఫ్రెండ్ అయ్యుండి కూడా నా పెళ్లికి రాలేదు. ఆ సమయంలో నేను చాలా అప్సెట్ అయ్యాను. ఆ తర్వాత ఆయన కనిపించినప్పుడు పెళ్లికి ఎందుకు రాలేదంటూ గట్టిగా తిట్టాను కూడా" అని రంభ నవ్వుతూ పాత జ్ఞాపకాలను గుర్తుచేసుకుంది. కొంతకాలం ఇద్దరం కలిసి ఒక టెలివిజన్ షోలో సందడి చేశామని, ఆ సమయంలో కూడా పాత రోజులను గుర్తుచేసుకుంటూ స్టేజ్ పైన ఎంతో ఫన్ క్రియేట్ చేశామని ఆమె తెలిపింది. ఆ ఎపిసోడ్‌కు ప్రేక్షకుల నుండి కూడా మంచి రెస్పాన్స్ వచ్చింది. తన సినీ కెరీర్ గురించి మాట్లాడుతూ రంభ కొన్ని చేదు నిజాలను పంచుకుంది. కెరీర్ ప్రారంభంలో తనకు ఎక్కువగా గ్లామర్ పాత్రలే వచ్చాయని.. ఆ తర్వాత నటిగా తన ప్రతిభను నిరూపించుకున్నప్పటికీ, ఇండస్ట్రీ తనను కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం చేసిందని ఆవేదన వ్యక్తం చేసింది. దీనివల్ల ఒక నటిగా తన పూర్తి నటనను ప్రదర్శించే అద్భుతమైన అవకాశాలను కోల్పోవాల్సి వచ్చిందని రంభ అభిప్రాయపడింది.

## సినిమాలు, ఘటనల మధ్య లంకె అనసూయ స్పందన

సమాజంలో చోటుచేసుకునే ప్రతి సంఘటనకు సినిమాలను కారణంగా చూపడం సరికాదని ప్రముఖ నటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ అభిప్రాయపడ్డారు. సినిమా ప్రభావం, సామాజిక బాధ్యత అంశాలపై శనివారం ఆమె సోషల్ మీడియా వేదికగా స్పందించారు. సృజనాత్మక స్వేచ్ఛతో పాటు, కంటెంట్ విషయంలో ప్రతి ఒక్కరికీ బాధ్యత ఉండాలని ఆమె గుర్తుచేశారు. సినిమా అనేది ప్రాథమికంగా ఒక కథా రూపమని, అందులోని మంచి చెడులను ప్రేక్షకులు తమ విచక్షణతోనే గ్రహించాలని ఆమె పేర్కొన్నారు. సమాజంలో జరిగే ప్రతికూల పరిణామాలకు సినిమాలనే తప్పుబట్టడం సమంజసం కాదని వ్యాఖ్యానించారు. కంటెంట్ విషయంలో క్రియేటర్లు, దర్శకులు, నటులతో పాటు ప్రేక్షకులకు సైతం సమాన బాధ్యత ఉంటుందని ఆమె స్పష్టం చేశారు. గతంలో సినిమాల్లో కథానాయకులు స్ఫూర్తిప్రదాతలుగా, ప్రతినాయకులు గుణపాఠంగా ఉండేవారని, కానీ ప్రస్తుతం నాటకీయత కోసం ఆ వ్యత్యాసాన్ని స్పష్టంగా చూపడం లేదని అనసూయ అభిప్రాయపడ్డారు. క్రియేటివ్ అంశాల్లో ఏకీభవించలేక కొన్నిసార్లు తాను అవకాశాలను సైతం వదులుకున్నట్లు ఆమె వెల్లడించారు. సోషల్ మీడియాలో సినిమా కంటెంట్‌ను విశ్లేషించడాన్ని, ప్రశ్నించడాన్ని ఆమె స్వాగతించారు. దీనిని సృజనాత్మకతపై దాడిగా కాకుండా, సమాజంలో పెరుగుతున్న చైతన్యంగా భావించాలని అన్నారు.



## ఈ వీకెండ్ ఫుల్ యాక్షన్ మోడ్.. ఓటీటీ చిత్రాలు..






'ధురంధర్: ది రివెంజ్' ఇప్పుడు భారత్ ఓటీటీ ప్రేక్షకులను అలరిస్తోంది. ప్రస్తుతం 'జియో హాట్‌స్టార్' వేదికగా హిందీ, తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా అందుబాటులోకి వచ్చింది. మిగిలిన దేశాల్లో సినీ అభిమానులు ఈ మూవీని 'నెట్‌ఫ్లిక్స్' వేదికగా చూడొచ్చు.

మలయాళ అగ్ర హీరోలు మమ్ముట్టి, మోహన్‌లాల్ కలిసి నటించిన సినిమా 'పేట్రియాట్'. 'జీ 5' (Zee 5) వేదికగా ప్రస్తుతం స్ట్రీమింగ్ అవుతోంది. తెలుగు ఆడియో కూడా అందుబాటులో ఉండనుంది. దేశభక్తితో కూడిన యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. నయనతార, ఫహాద్ ఫాజిల్ లాంటి స్టార్లు కీలక పాత్రలు పోషించారు.


నటుడు అర్జున్ మేనల్లుడు ధ్రువ్ సర్జా హీరోగా నటించిన యాక్షన్ చిత్రం 'కేడీ: ది డెవిల్'. యాక్షన్ ప్రియులను అలరించిన ఈ మూవీ కూడా 'జీ 5'లో అందుబాటులోకి వచ్చింది. కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం భాషల్లో అందుబాటులోకి రానుంది. రీష్మా హీరోయిన్ కాగా సంజయ్ దత్, శిల్పాశెట్టి తదితరులు కీలక పాత్రలు పోషించారు.


నందు, అవికా గోర్, రవితేజ మహాదాస్యం ప్రధాన పాత్రల్లో




తెరకెక్కిన చిత్రం 'అగ్లీ స్టోరీ'. ప్రణవ స్వరూప్ దర్శకుడు. రొమాంటిక్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ మూవీ మే 22న ప్రేక్షకుల ముందుకువచ్చింది. ఇప్పుడు ఆహాలో తెలుగు, తమిళ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది.

వరలక్ష్మి శరత్‌కుమార్ స్వీయ దర్శకత్వంలో రూపొందిన సైకలాజికల్ థ్రిల్లర్ 'ఎస్. సరస్వతి'. తెలుగువారి ఓటీటీ ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. వరలక్ష్మి శరత్‌కుమార్ నిర్మాణంలో వచ్చిన ఈ సినిమాలో జీవా, ప్రకాశ్ రాజ్, మురళీ శర్మ, రావు రమేశ్, ప్రియమణి కీలక పాత్రల్లో కనిపించారు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.